లోకాయుక్త విస్తృత దాడులు

ఐఏఎస్ వాసంతి అమర్ సహా పలువురి ఇళ్లలో సోదాలు



స్వాధీనం చేసుకున్న నగదు, ఆభరణాలు, సామగ్రి

బెంగళూరు, జూలై 23(ఆంధ్రజ్యోతి): బెంగళూరు నగర జిల్లా స్పెషల్ అధికారి వాసంతి అమర్ సహా పలువురి నివాసాలు, కార్యాలయాలపై లోకాయుక్త బుధవారం దాడులు జరిపింది. అక్రమ ఆస్తులు ఉన్నాయనే ఆరోపణలు రావడంతో ఆధారాలు సేకరించిన లోకాయుక్త, 8 జిల్లాల పరిధిలో దాడులు చేసింది. టౌన్ ప్లానింగ్ అసిస్టెంట్ డైరెక్టర్ మారుత బాగ్లి, బీబీఎంపీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ ఎర్రప్పరెడ్డి నివాసాలు, కార్యాలయాలపై దాడులు చేశారు. ఐఏఎస్ అధికారి వాసంతి అమర్ ప్రభుత్వ భూమిని ఇతరులకు బదిలీ చేసిన ఆరోపణలు మేరకు దాడులు చేశారు. ఎర్రప్ప రెడ్డి ఇటీవల రూ.10 లక్షలు లంచం తీసుకుంటుండగా దాడులు చేశారు. ఈమేరకు ఆదాయానికి మించి ఆస్తులు ఉన్నాయనే దాడులు నిర్వహించారు. వైద్య ఆరోగ్యశాఖ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ సునిల్‌కుమార్‌కు సంబంధించి కలబురగిలోని నివాసం, కార్యాలయంపైనా దాడులు చేశారు. బీదర్ అర్బన్, రూరల్ ప్లానింగ్ అసిస్టెంట్ డైరెక్టర్ మారుతిబాగ్లికి సంబంధించిన నివాసంపై దాడులు ఏశారు. కొప్పళ జిల్లా పారిశ్రామిక, వాణిజ్యపన్నులశాఖ డిప్యూటీ డైరెక్టర్ షేకూ చౌహాన్ ఇంటిపై దాడి చేసి రూ.52 లక్షలు, కేజీ బంగారం, 3 కేజీల వెండి వస్తువులతోపాటు 13 ప్రదేశాలలో ఇంటి స్థలాలు ఉన్నట్లు గుర్తించారు. మైసూరులో పాలికె ఉప విభాగపు అధికారి వెంకటరామ్, నైపుణ్యాభివృద్ధిశాఖ జాయింట్ డైరెక్టర్ మంజునాథస్వామి ఇళ్లపైనా దాడులు చేశారు.

చెరువులను పరిశీలించిన ఎమ్మెల్యేల బృందం



వర్తూరు చెరువువద్ద బ్లూ ప్రింట్‌ను పరిశీలిస్తున్న బృందం సభ్యులు

బెంగళూరు, జూలై 23(ఆంధ్రజ్యోతి): నగర పరిధిలోని చెరువులను ఎమ్మెల్యేల బృందం పరిశీలించింది. ఎమ్మెల్యేల స్థాయి కమిటీ అధ్యక్షుడు రిజ్వాన్ అర్షద్ నేతృత్వంలో రవిసుబ్రమణ్య, హారీశ్‌పూంజా, వెంకటశివారెడ్డి, ఎమ్మెల్సీ శశికళ జొల్లెలు బుధవారం మేడహళ్ళిలోని ఎల్ మల్లప్పశెట్టి చెరువును పరిశీలించారు. 9.5 కిలోమీటర్ల కంచెను పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. చెరువుల ఆక్రమణలు అరికట్టాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. వర్తూరు చెరువును పరిశీలించి కలుషిత నీరు మిశ్రమం కాకుండా చర్యలు చేపట్టాలని బీడీఏ ఇంజనీర్ డాక్టర్ శాంతరాజన్‌కు సూచించారు. బెళ్ళందూరు, అగర చెరువులను పరిశీలించారు. బీబీఎంపీ స్పెషల్ కమిషనర్ కరిగౌడ, చిన్ననీటి పారుదలశాఖ జాయింట్ కమిషనర్ పవిత్ర ఉన్నారు.

ధర్మస్థళపై ప్రచారానికి యూట్యూబర్ అర్జీని రద్దు చేసిన సుప్రీంకోర్టు

బెంగళూరు, జూలై 23(ఆంధ్రజ్యోతి): ధర్మస్థళ ధర్మాధికారితోపాటు వారి కుటుంబ సభ్యులపై ఎటువంటి కథనాలు ప్రచారం, ప్రసారం చేయరాదని విధించిన నిబంధనలు సడలింపు కోసం సుప్రీంకోర్టులో దాఖలు చేసిన పిటిషన్‌ను ధర్మాసనం రద్దు చేసింది. థర్డ్ ఐ అనే యూట్యూబ్ చానెల్ సుప్రీంకోర్టులో పిటిషన్ దాఖలు చేసింది. పత్రికా స్వాతంత్ర్యం, వాక్ స్వాతంత్ర్యాన్ని కట్టడి చేసేలా నిబంధనలు ఉన్నాయనీ, తాము కథనాలు చేసేందుకు అవకాశం ఇవ్వాలని పిటిషన్‌లో పేర్కొన్నారు. సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి బీఆర్ గవాయ్, జస్టిస్ వినోద్‌చంద్రన్, జస్టిస్ జోయ్మల్యా బాగ్చిల ధర్మాసనం పిటిషన్‌ను బుధవారం కొట్టివేసింది. ఈ విషయమై కర్ణాటక హైకోర్టును ఆశ్రయించాలని సూచించింది. అక్కడ న్యాయం జరగలేదని భావిస్తే సుప్రీంలో పిటిషన్ దాఖలు చేయాలన్నారు.

రాబకొవి పీఠం దక్కేదెవరికో..?

● ఈసారి అధ్యక్ష స్థానం కొప్పళ్ జిల్లాకేనా?



8

శరణ సంస్కృతిని విస్తరించాలి


కేవీ నాగరాజమూర్తి

'కర్పూరద బెళగు' పుస్తకావిష్కరణ



జల విద్యుత్ ఉత్పత్తిపై నిర్లక్ష్యపు నీడ..!

● కొత్త ప్రాజెక్టుల పట్ల నిరాసక్తత
● జలాశయాలు నిండినా.. నీరు వృథా



లింగనమక్కి పవర్‌హౌస్ (ఫైల్)

బెంగళూరు, జూలై23(ఆంధ్రజ్యోతి): విద్యుత్ ఉత్పత్తిలో సహజవనరులకు ప్రాధాన్యం ఇవ్వాలని, తద్వారా థర్మల్ ప్రాజెక్టులపై భారం తగ్గుతుందని భావిస్తున్నారు. సౌరవిద్యుత్‌కు వేలాది ఎకరాల పంటల భూములు వినియోగించడం సాగుకు అడ్డంకి కానుందని, చెరువులలో తేలియేడా సోలార్‌ప్లాంట్‌లను అమర్చాలని ప్రయత్నిస్తున్నారు. ఇది బాగానే ఉన్నా రాష్ట్రంలో రెండు నెలలుగా కురుస్తున్న వర్షాలకు అన్ని జలాశయాలు నిండి పొంగిపొర్లుతున్నాయి. విద్యుత్ ఉత్పత్తి కేంద్రాలు కల్గిన జలాశయాలు కూడా నిండాయి. అయితే సాంకేతిక లోపాలతో నాలుగు విభాగాలు స్తంభించగా మరో రెండు విభాగాలు ఉత్పత్తి చేయడం లేదు. ఇలా జలాశయాలనుంచి నీరు వృథా అవుతోంది.

● రాష్ట్రంలో విద్యుత్ ఉత్పత్తి సామర్థ్యాన్ని రానున్న ఏడేళ్లలో 32వేల మెగావాట్ల నుంచి 60వేల మెగావాట్లకు చేర్చాలని ప్రభుత్వం భావిస్తోంది. ఇందుకోసం గ్రీన్ ఎనర్జీతోపాటు విద్యుత్ ప్రాజెక్టులకు ప్రాధాన్యం ఇస్తోంది. జలవిద్యుత్ కేంద్రాలు పూర్తిస్థాయిలో ఉత్పత్తికి నోచుకోవడం లేదు.

ప్రాజెక్టుల నీరు వృథా

నాలుగు విద్యుత్ విభాగాలు సాంకేతికంగా స్తంభించడంతో 350 మెగావాట్ల విద్యుత్ ఉత్పత్తి తగ్గింది. మరోవైపు విద్యుత్ ఉత్పత్తి విభాగాలు అప్పుడప్పుడు సాంకేతిక లోపాలతో ఉత్పత్తి సాధ్యం కాకుండా పోతుంది. ఇలా 115 మెగావాట్ల విద్యుత్ ఉత్పత్తి లోటు ఏర్పడుతోంది. జల విద్యుత్ ఉత్పాదనా విభాగాలలోని టర్బైన్‌లలో ఉండే రన్నర్‌బ్లేడ్‌లలో చీలికలు ఏర్పడటంతో ఉత్పత్తి విభాగాలు స్తంభించేందుకు మూల కారణంగా ఉంది. లింగనమక్కిలోని రెండో విభాగం ఏడాదిన్నరకాలంగా పనిచేయడం లేదు. విద్యుత్ ఉత్పత్తి కేంద్రాల్లో టర్బైన్లకు హృదయంలాంటివి రన్నర్‌బ్లేడ్‌లు, స్టెయిల్‌లెస్ స్టీల్, మిశ్రమలోహాలతో తయారు చేస్తారు. ప్రవహిస్తున్న నీటి ఒత్తిడి ద్వారా గమనాన్ని మార్చి విద్యుత్తుగా పరివర్తింపచేయడంలో రన్నర్‌బ్లేడ్‌లు కీలకంగా పనిచేస్తాయి. శరావతి పథకానికి అనుబంధమైన మూడో విభాగం నిలిచిపోయి నెలలు గడుస్తోంది. నాగఝరి పవర్‌హౌస్ (అంబికానగర్)లోని 1, 2, 3 విభాగాలు ఆధునికీకరణకు ఐదేళ్లుగా ప్రతిపాదనలో ఉన్నా ముగించడం లేదు. ఇందులో ఒక విభాగం పూర్తిగా స్తంభించింది. మరో రెండు విభాగాలు అప్పుడప్పుడు మరమ్మతులకు నోచుకుంటున్నాయి.

డిమాండ్ లేదనే కారణం..

వేసవిలో 18వేల మెగావాట్ల డిమాండ్ ఉండేది. ప్రస్తుతం 8125 మెగావాట్లకు తగ్గింది. డిమాండ్ లేని కారణంగా కర్ణాటక పవర్ కార్పొరేషన్ లిమిటెడ్ (కేపీసీఎల్)లోని జల విద్యుత్ విభాగాలను అప్పుడప్పుడు నిలిపివేస్తారు. స్టేట్ లెవెల్ డిస్పాచ్ సెంటర్ (ఎస్ఎల్‌డీసీ) సూచనకు అనుగుణంగా నిర్వహణ ఉంటుందని విద్యుత్ అధికారులు చెబుతున్నారు. డిమాండ్ లేదనేది కేవలం ఒక నెపంగా మాత్రమే ఉంది. జల విద్యుత్ ఉత్పత్తి ప్రతి యూనిట్‌కు రూ.1.80 లభిస్తుంది. తక్కువధరతో జల విద్యుత్ ఉత్పత్తి చేసేందుకు అవకాశం ఉంది. విద్యుత్ ఉత్పత్తికేంద్రాలు జలాశయాలకు వస్తున్న నీరు టర్బైన్లకు బదులు తూములద్వారా నదులకు మళ్లిస్తున్నారు. లింగనమక్కి పవర్ ప్రాజెక్టు నీరు ఇలా వృథా అవుతున్నట్టు తెలుస్తోంది.

● జలవిద్యుత్ ఉత్పత్తి ప్రాజెక్టుల ప్రదేశానికి వెళ్లేందుకు సిద్ధంగా లేని ఇంజనీర్లు తెరవెనుక లాబీ ద్వారా బదిలీలు చేయించుకుంటున్నారు. ఎక్కువమంది ఇంజనీర్లు ఆయకట్టు స్థలాల్లో ఉంటారుగానీ, విద్యుత్ ఉత్పత్తి కేంద్రాల నిర్వహణ దారి తప్పింది. వేలాదిమంది ఇంజనీర్లు, కార్మికుల పోస్టులు ఖాళీగా ఉండడంతో ఇతర ప్రాంతాలలో పనిచేసేందుకు వెళ్లిపోతున్నారు. ఇలా జల విద్యుత్ ఉత్పత్తి కేంద్రాల వద్ద పనిచేసే ఇంజనీర్లు కరువవుతున్నారు.

● ప్రాజెక్టు చీఫ్ ఇంజనీర్లు పర్యవేక్షిస్తున్నారు. దానికి బదులుగా కేంద్ర కార్యాలయం నుంచే బదలీలు వంటి ప్రక్రియ సాగుతుండడంతో ప్రాజెక్టుల వద్ద ఇంజనీర్లకు తెలియకుండానే బదిలీలపై వెళ్లిపోతున్నారు. పాలనాత్మకంగా పని ఎక్కువగా ఉండే ఇంజనీర్లలో బెంగళూరులో 170మంది ఉన్నారు. శివశింషాలో 36, ఆల్మట్టిలో 27, మునీరాబాద్‌లో 20, ఘటప్రభ 12, భద్రలో 15మంది ఇంజనీర్లు ఉన్నారు. ఇక్కడ అవసరానికంటే ఎక్కువమంది ఉన్నారు. కానీ లింగనమక్కి, శరావతి, నాగఝరి ప్రాజెక్టుల వద్ద ఇంజనీర్ల కొరత వెంటాడుతోంది. నాగఝరి విద్యుత్ స్థావరంలోని 3 విభాగాల ఆధునికీకరణ పనులు ఏడేళ్లుగా నత్తనడకన సాగుతున్నాయి. ఇందుకోసం రూ.117 కోట్లు అంచనా వేయగా ప్రస్తుతం అది రూ.390 కోట్లకు పెరిగింది. ఉద్దేశించిన సంపూర్ణ ప్రక్రియ పూర్తయ్యేసరికి రూ.500కోట్లకు చేరే అవకాశం ఉంది.

● సిద్దరామయ్య ముఖ్యమంత్రిగా ఉన్న 2013-18 కాలంలో విద్యుత్ ఉత్పత్తికి సంబంధించి శరావతిలోని 10 విభాగాలు నిలిచిపోయాయి. ఇంజనీర్లు, కార్మికబృందం 6నెలలపాటు శ్రమించి పునరుద్ధరించారు. విద్యుత్ ఉత్పత్తికి అవకాశం కల్పించారు. ప్రస్తుతం అన్ని పనులు టెండర్ల ద్వారా కంట్రాక్టు సంస్థలకు ఇస్తున్నారు. ఇంజనీర్లలో పనిచేసే వాతావరణం లేకుండా పోతోంది. పైగా ఇంజనీర్లను తరచూ బదిలీ చేస్తుండడంతో ప్రాజెక్టులలో పనుల నాణ్యతకు, పర్యవేక్షణకు తగినంత ప్రాధాన్యం లేకుండాపోతోంది. వృథా అవుతున్న నీటిని సద్వినియోగం చేసుకునే దిశగా ప్రభుత్వం చొరవ చూపాల్సిన అవసరం ఉందనే అభిప్రాయాలు పలువురిలో వ్యక్తం అవుతున్నాయి.

కూడలసంగమంలోనూ కుట్ర

● ఎమ్మెల్యే బసనగౌడ పాటిల్ యత్నాళ్

బెంగళూరు, జూలై 23 (ఆంధ్రజ్యోతి): భారతీయ మూలధర్మాలు, పవిత్ర క్షేత్రాలపై కుట్ర సాగుతోందని ధర్మస్థళ తరహాలోనే కూడలసంగమాన్ని అపవిత్రం చేసే ప్రయత్నాలు సాగుతున్నాయని ఎమ్మెల్యే బసనగౌడ పాటిల్ యత్నాళ్ ఆరోపించారు. కొప్పళలో బుధవారం ఆయన గవిమఠాన్ని సందర్శించిన అనంతరం మీడియాతో మాట్లాడారు. కమ్యూనిస్టు భావజాలంతో కాషాయవేషం ధరించిన కొంతమంది ఇస్లాం, లింగాయత రెండూ ఒక్కటే అనేలా వ్యవహరిస్తున్నారన్నారు. దేశంలో తొలుత అయ్యప్పస్వామి ఆలయంపై కుట్ర పన్నారని, ఇటీవల ధర్మస్థళపై పడ్డారని, ప్రస్తుతం కూడలసంగమాన్ని అపవిత్రం చేసేందుకు సిద్ధమయ్యారన్నారు. కూడలసంగమంలో కొందరు వ్యక్తిగత ఆసక్తితో తాళం వేశారన్నారు. రానున్న రోజుల్లో వారి ఇళ్లకు తాళాలు వేసే పరిస్థితి వస్తుందన్నారు. ప్రజలు భక్తితో ఇచ్చిన సొమ్మును దుర్వినియోగం చేస్తే వారు అభివృద్ధి చెందరన్నారు. వీరశైవలింగాయతలు ఒకటి కావాలని, దావణగెరెలో సమావేశం జరిపారన్నారు. అక్కడి ఫ్లెక్సీలలో వీరశైవలింగాయత అని రాయలేదన్నారు. యడియూరప్ప, శ్యామనూరు శివశంకరప్ప, ఈశ్వర్‌ఖండ్రె త్రిమూర్తుల తరహాలో కూర్చుని ఆదేశాలు జారీ చేస్తున్నారన్నారు. విజయేంద్రను అధ్యక్షుడిగా మరోసారి ప్రకటిస్తే అదే రోజునే కొత్త రాజకీయ పార్టీని ప్రకటిస్తానన్నారు. రాష్ట్రంలో ఎవరూ విజయేంద్ర నాయకత్వాన్ని అంగీకరించడం లేదన్నారు. అతడి నేతృత్వంలో ఎన్నికలకు వెళ్తే 30 సీట్లు కూడా గెలవలేరన్నారు. ఎవరిని అధ్యక్షుడిని చేసినా బీజేపీలో ఉంటానని, పార్టీని వీడేది లేదన్నారు. యడియూరప్ప కుమారుడికోసం నన్ను బయట వేశారన్నారు. డీకే శివకుమార్ ముఖ్యమంత్రి అవుతారని కొందరు స్వామీజీల వ్యాఖ్యలపై స్పందిస్తూ కొందరు స్వామీజీలు అవినీతిపరులయ్యారని, డబ్బు ఇచ్చి పాదపూజ చేస్తే ముఖ్యమంత్రి ఏం కర్మ... ప్రధానమంత్రి అవుతారన్నారు.



కొప్పళ గవిమఠంలో ఎమ్మెల్యే యత్నాళ్ తదితరులు

కేజీఎఫ్ బాబుకు ఆర్టీఓ అధికారుల నోటీసు

బెంగళూరు, జూలై 23 (ఆంధ్రజ్యోతి): ముంబైలో రిజిస్ట్రేషన్ చేసిన లగ్జరీకారును ఉపయోగిస్తున్న పారిశ్రామికవేత్త కేజీఎఫ్ బాబుకు ఆర్టీఓ అధికారులు నోటీసులు ఇచ్చారు. వసంతనగర్‌లోని బాబు నివాసంపై రవాణాశాఖ జాయింట్ కమిషనర్ శోభా నేతృత్వంలో బుధవారం దాడి చేశారు. పన్ను చెల్లించాలని సూచించారు. రోల్స్‌రాయ్స్, విల్‌ఫైర్, పోష్‌తోపాటు పలు విలాసవంతమైన కార్లను కేజీఎఫ్ బాబు ఉపయోగిస్తున్నారు. సూపర్‌స్టార్ అమితాబ్ బచ్చన్, నటుడు అమీర్‌ఖాన్‌లకు చెందిన రెండు లగ్జరీ కార్లను కొనుగోలు చేశారు. ముంబైలో రిజిస్ట్రేషన్ అయిన ఓ కారు ఏడాది కాలంగా బెంగళూరులో తిరుగుతున్న మేరకు రవాణాశాఖ అధికారులు గుర్తించి ఆరా తీశారు. ఇదే విషయమై కేజీఎఫ్ బాబు మాట్లాడుతూ ఇదో పెద్ద సంఘటన కాదని, ఒకే కారును బెంగళూరు, ముంబైలలోనూ వినియోగిస్తానన్నారు. ఇక్కడ వాడుతున్నందుకు పన్ను కట్టాలని సూచించారన్నారు. అందుకు అనుగుణంగానే రూ.38 లక్షల చెక్కును ఆర్టీఓ అధికారులకు చెల్లించారు.

ఆభరణాలు ఫ్యాషన్‌గా మారుతున్నాయ్

బెంగళూరు, జూలై 23(ఆంధ్రజ్యోతి): ఆభరణాలంటే మహిళలకు ఇష్టమని, అవి ఫ్యాషన్‌గా మారిపోయాయని బాలీవుడ్ నటి సుశృత్ భరూచా అన్నారు. ఇటీవల నగరంలో కుశాల్ ఫ్యాషన్ జ్యూవెలరీ దుకాణాన్ని ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా సుశృత్ మాట్లాడుతూ వినియోగదారులు కోరుకున్న డిజైన్లను కుశాల్ సమకూరుస్తోందన్నారు. ప్లేటింగ్ టెక్నాలజీ ద్వారా ఉత్పత్తులు చేస్తోందన్నారు. ఎలివేటెడ్ ఎవెరిడే శ్రేణిని మరింత విస్తరించదలిచారన్నారు. 2006లో కుశాల్ ఫ్యాషన్స్ ప్రారంభం కాగా ప్రస్తుతం 38 నగరాలలో 100 దుకాణాలు కలిగి ఉన్నట్టు ప్రకటించారు.

మెట్రో ఎల్లో లైన్ సురక్షతా పరిశీలన

బెంగళూరు, జూలై 23(ఆంధ్రజ్యోతి): నమ్మ మెట్రో ఎల్లో లైన్ మార్గం నిర్మాణ పనులు ముగియడంతో అందుబాటులోకి తేవడానికి తొలి విడత సురక్షతా పరిశీలన పనులు చేపట్టారు. మంగళవారం చేపట్టిన సేఫ్టీ చెక్ గురువారం వరకు కొనసాగనుంది. మెట్రోరైల్ సేఫ్టీ కమిషనర్ అధికారుల బృందం స్వయంగా పరిశీలించింది. తొలిరోజు ఆర్‌వీ రోడ్డు-బొమ్మసంద్ర మార్గాన్ని పరిశీలించారు. 19.15 కిలోమీటర్ల పొడవైన మార్గంలో నాలుగు స్టేషన్‌ల వరకు ట్రాక్ పరిశీలన, నాణ్యత, వాటికి విద్యుత్ కనెక్షన్, సిగ్నలింగ్ వ్యవస్థ, స్టేషన్‌లలో సౌకర్యాలు, అత్యవసర ఎగ్జిట్ సహా సివిల్ పనులు పరిశీలించారు. అన్ని స్టేషన్‌ల పరిశీలన అనంతరం సీఎంఆర్ఎస్ నుంచి వారంరోజుల్లోగా అనుమతి వచ్చే అవకాశం ఉందని బీఎంఆర్‌సీఎల్ అధికారులు తెలిపారు. పరిశీలనా నివేదిక అనంతరం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలతో చర్చలు జరిపి ప్రారంభ తేదీని ఖరారు చేసే అవకాశం ఉందన్నారు. ఈ మార్గంలో 16 మెట్రో స్టేషన్‌లు ఉన్నాయన్నారు. ప్రారంభోత్సవానికి సంబంధించి సన్నాహాలు పూర్తి చేస్తున్నామని, నిర్మాణ మార్గం, మెట్రో స్టేషన్‌లను డ్రోన్‌ల సాయంతో వీడియో చేసేందుకు ప్రైవేట్ సంస్థతో ఒప్పందం కుదిరిందన్నారు. ప్రారంభోత్సవం రోజున వీడియో ప్రదర్శించే అవకాశం ఉందన్నారు. ఈ మార్గంలో బొమ్మసంద్ర, హెబ్బగూడి, హొసూర్ రోడ్డు, ఇన్ఫోసిస్ ఫౌండేషన్ (కోనప్పన అగ్రహార), ఎలక్ట్రానిక్‌సిటీ, బెరటేన అగ్రహార, హొసరోడ్డు, సింగసంద్ర, కూడ్లుగేట్, హొంగసంద్ర, బొమ్మనహళ్ళి, సెంట్రల్ సిల్క్ బోర్డ్, బీటీఎం లే అవుట్, జయదేవ ఆసుపత్రి, రాగిగుడ్డ ఆర్‌వీ రోడ్డు స్టేషన్‌లు ఉన్నాయి.



ట్రాక్‌ను పరిశీలిస్తున్న అధికారుల బృందం

షెడ్ నిర్మిస్తుండగా ప్రమాదం.. ముగ్గురు యువకుల దుర్మరణం



మృతులు (ఫైల్)

బెంగళూరు, జూలై 23(ఆంధ్రజ్యోతి): చిత్రదుర్గ జిల్లా హొళలక్కెరె తాలూకా కాలఘట్ట గ్రామంలో షెడ్ నిర్మిస్తుండగా ఐరన్ పైప్ విద్యుత్ తీగలకు తగలడంతో ముగ్గురు దుర్మరణం చెందారు. శ్రీనివాస్ అనే తోట యజమాని వక్కలను సంస్కరించేందుకు ప్రత్యేకంగా ఓ షెడ్‌ను నిర్మిస్తున్నారు. బుధవారం ఐరన్‌పైప్ జారి విద్యుత్ తీగలపై పడిన ఘటనలో ముగ్గురు షాక్ గురయ్యారు. తోట యజమాని శ్రీనివాస (35), కూలీలు నాసిర్ (30), ఫరూక్ (30) తీవ్రంగా గాయపడ్డారు. హుటాహుటిన వారిని దావణగెరెలోని ప్రైవేట్ ఆసుపత్రికి తరలించగా చికిత్సలు ఫలించక మృతి చెందారు. మృతుల బంధువు నౌషిన్‌తాజ్ మాట్లాడుతూ వక్కల షెడ్ నిర్మించేవేళ ఐరన్‌పైప్ అమరుస్తుండగా విద్యుత్ తీగలకు తగిలిందన్నారు. మృతి చెందిన ముగ్గురికి చిన్న పిల్లలు ఉన్నారన్నారు. ఫరూక్, నాసిర్‌లు అణబేరు గ్రామానికి చెందినవారన్నారు. హొళల్కెరె పోలీసులు కేసు నమోదు చేసుకున్నారు.

బైక్‌పై కూలిన చెట్టు.. ఇద్దరి మృతి



కూలిన చెట్టుకింద ఉన్న బైక్

రాయచూరు, జూలై 23(ఆంధ్రజ్యోతి): రోడ్డుపై వెళుతున్న బైక్‌పై చెట్టు విరిగిపడటంతో ఇద్దరు యువకులు దుర్మరణంపాలైన ఘటన జిల్లాలో బుధవారం చోటు చేసుకుంది. ముదగల్ పట్టణ సమీపంలో జరిగిన ఈ ప్రమాదంలో బైక్‌పై వెళుతున్న ఇద్దరు యువకులు అక్కడికక్కడే మృత్యువాతపడగా మరో మూడేళ్ల చిన్నారి సౌజన్య రమేశ్ స్వల్ప గాయాలతో బయటపడింది. ముదగల్ నుంచి నాగలాపూర్‌కు రమేశ్ గుడదప్ప(25), అనుసూయ రమేశ్(22) అనే ఇద్దరు యువకులు బైక్‌పై వెళుతుండగా ఆ మార్గంలో రోడ్డు పక్కనే ఉన్న పురాతన చెట్టు ఒకటి కూలింది. ఇద్దరు యువకులు చనిపోగా చిన్నారికి తీవ్ర గాయాలు కాగా గాయపడిన బాలుడిని పోలీసులు ఆస్పత్రికి తరలించారు. మృతదేహాలను పోస్టుమార్టం కోసం లింగసుగూరు తాలూకా ఆస్పత్రికి తరలించారు. ముదగల్ ఎస్ఐ వెంకటేశ్ ఘటనా స్థలాన్ని పరిశీలించి కేసు నమోదు చేశారు.

ఈవీలకు పెరిగిన డిమాండ్

ఐదేళ్లలో రెట్టింపైన అమ్మకాలు

ఈవీ బస్సుల కొనుగోళ్లకు ఆర్టీసీ సిద్ధం



8

చెట్టు దిగి.. కొండెక్కిన టెంకాయ..!



సూపర్‌మార్కెట్‌లో చిన్నసాటి కొబ్బరికాయ రూ.45 రాసిన దృశ్యం

హిందూపురం, జూలై23(ఆంధ్రజ్యోతి): శ్రావణ మాసంలో పూజలు నిర్వహించే భక్తులను టెంకాయ ధరలు భయపెడుతున్నాయి. సాధారణ రోజుల్లో ఒక్కో టెంకాయ గరిష్ఠ ధర రూ.35 వరకూ ఉంటుంది. ప్రస్తుతం కొరత కారణంగా రూ.60కి చేరింది. కర్ణాటక, తమిళనాడులో పంట తగ్గిపోవడంతో ఈ పరిస్థితి ఏర్పడింది. ఉమ్మడి జిల్లా వ్యాపారులు సుదూర ప్రాంతాల నుంచి టెంకాయలను కొనుగోలు చేసి తెచ్చుకుంటారు. దీంతో రవాణా ఖర్చులు పెరిగిపోయాయి. దీంతో కాయ సైజును బట్టి కనీసం రూ.35 ఆపై రూ.60 వసూలు చేస్తున్నారు. నెల వ్యవధిలో ఒక టెంకాయపై రూ.20 ధర పెరిగిందని వ్యాపారులు చెబుతున్నారు. ధరలు పెరగడంతో తక్కువగా తెచ్చుకుంటున్నామని, లాభాలు తగ్గాయని వాపోతున్నారు. ధర భారీగా పెరగడంతో సామాన్యులు కొనడం లేదని, ఆలయాల్లో టెంకాలను కొట్టడం తగ్గించేశారని అంటున్నారు.

పంట లేకపోవడమే..

ఉమ్మడి జిల్లాలో కొబ్బరి చెట్లు చాలా తక్కువ. దీంతో కర్ణాటకలోని తుమకూరు, టిప్టూరు, శివమొగ్గ, తమిళనాడు, కొయంబత్తూరు, పొలచి నుంచి కొనుగోలు చేసి తెచ్చుకుంటారు. అక్కడ కూడా చెట్లకు చెదలు, పురుగులు పట్టడంతో ఈసారి పంట దిగుబడి 50 శాతానికి పైగా తగ్గింది. దీనికితోడు రాష్ట్రంలో కూడా కొబ్బరికాయల పంట పూర్తిగా రాలేదు. ఈ కారణాలతో ధరలు ఒక్కసారిగా భారీగా పెరిగాయి.

ఇప్పుడే ఇలా అయితే..

ఇప్పుడు పెరిగిన ధరలు ఆషాఢ మాసంలో అమలులో ఉన్నవి. ఇళ్లలో మినహా ఆలయాల్లో పెద్దగా పూజలు ఉండవు. ఆ మేరకు టెంకాల వినియోగం కూడా తక్కువగానే ఉంది. నిత్యం శుభకార్యాలు జరిగే శ్రావణ మాసం శుక్రవారం నుంచి మొదలౌతుంది. అప్పుడు పరిస్థితి ఎలా ఉంటుందోనని భక్తులు, వ్యాపారులు భయపడే పరిస్థితి ఏర్పడింది. సాధారణ పూజలకు ఒకటి రెండు టెంకాయలు సరిపడతాయి. కానీ శుభకార్యాల కోసం వందల్లో కొనాల్సి ఉంటుంది. దీంతో ఖర్చు తడిసి మోపడవుతుంది. వరలక్ష్మీవ్రతం, నాగులచవితి, వినాయకచవితి వంటి పండుగలు వరుసపెట్టి వస్తాయి. పెళ్లి, పేరంటం, గృహ ప్రవేశాలు వంటివి భారీగా జరుగుతాయి. డిమాండ్ పెరిగితే టెంకాయల ధరలు మరింత పెరుగుతాయని సామాన్యులు ఆందోళన చెందుతున్నారు.

ఎల్లీరు కూడా కారణం

కర్ణాటక, తమిళనాడు నుంచి వచ్చే టెంకాయలతో పాటు ఎల్లీరు (కొబ్బరి బోండాం) నీటికి ఎక్కువ గిరాకీ ఉంటుంది. అనారోగ్యం బారినపడితే ప్రతిరోజూ ఎల్లీరు నీరు తీసుకుంటారు. ప్రస్తుతం కొబ్బరికాయకంటే ఎల్లీరు ధర ఎక్కువగా ఉంటోంది. మంచి లాభాలు వస్తాయని ఎల్లీరు కాయలు అమ్మడానికే రైతులు ఎక్కువగా మొగ్గు చూపుతారు. పైగా మూడు నెలలకే చెట్టు నుంచి పంటను తీసుకోవచ్చు. అదే టెంకాయ అయితే నాలుగు నుంచి ఐదునెలలపాటు చెట్టుపైనే కాయను ఉంచాల్సి వస్తుంది.


విక్రయించడానికి సిద్ధంగా ఉంచిన కొబ్బరికాయలు

ఒకప్పుడు లోడు తీసుకునేవాళ్లం..

గతంలో ఆషాఢ మాసంలోనే లోడు కొబ్బరికాయలు (సుమారు 15 వేలు) దిగుమతి చేసుకునేవాళ్లం. కానీ ఇప్పుడు ధరలు పెరగడంతో ప్రస్తుతం వెయ్యి లేదా రెండు వేల కాయలు మాత్రమే తీసుకుంటున్నాం. వ్యాపారాలు కూడా బాగా తగ్గాయి.

-నాగరాజు, కొబ్బరికాయల వ్యాపారి

ఎప్పుడూ ఈ ధర చూడలేదు..

నేను 20 ఏళ్లుగా కొబ్బరికాయల వ్యాపారం చేస్తున్నాను. గతంలో ఎప్పుడూ ఇలా ఉన్నట్టుండి కొబ్బరికాయల ధరలు పెరగడం చూడలేదు. ఇందుకు మన రాష్ట్రంతో పాటు కర్ణాటక, తమిళనాడులో పంట రాకపోవడమే కారణం.

-బాషా, కొబ్బరికాయల వ్యాపారి, హిందూపురం

పావగడలో ఉత్సవ శోభ

26 నుంచి శ్రావణమాస వేడుకలు


సిద్ధమైన సువర్ణ శనీశ్వరుడు

పావగడ, జూలై 23(ఆంధ్రజ్యోతి): పట్టణంలో ప్రసిద్ధి చెందిన శనీశ్వరుడి ఆలయం శ్రావణ మాస ఉత్సవాలకు ముస్తాబైంది. ఈనెల 25నుంచి జరిగే శ్రావణమాస ఉత్సవాలకు బంగారు కవచాలతో స్వామి అలంకృతమయ్యారు. ఉత్సవాల్లో జేష్టాదేవి సమేతంగా స్వామివారు భక్తులకు దర్శనమిస్తారు. ఈనెల 25నుంచి వచ్చేనెల 23వ తేదీ వరకు ఐదు శ్రావణ శనివారాల్లో ఉత్సవాలు అత్యంత వైభవంగా నిర్వహించనున్నారు. అందుకు ఏర్పాట్లు పూర్తి చేశారు.

శనివారాల్లో..

జూలై 26న మొదటి శ్రావణ శనివారం సందర్భంగా ఉదయం నాలుగు గంటలకు స్వామివారికి తొలిపూజ చేస్తారు. పంచామృతాభిషేకాలు, నవగ్రహ పూజ నిర్వహిస్తారు. అదేరోజు రాత్రి7.30కి స్వామివారికి విశేష పూజలు చేయనున్నట్లు ప్రధాన అర్చకులు కృష్ణస్వామి, మనోహర్, సంజయ్ తెలిపారు. ఆగస్టు 2, 8, 16, 23 తేదీల్లో జేష్టాదేవి సమేతంగా వెండి పల్లకిలో స్వామివారు ఊరేగనున్నారు.

సకల దోషాలు తొలగుతాయని..

శ్రావణమాసం ఉత్సవాల సందర్భంగా శనేశ్వరున్ని దర్శించుకుంటే సకల శనిదోషాలు తొలగుతాయని భక్తుల అపార నమ్మకం. స్వామివారికి ఎంతో ఇష్టమైన నల్లగుడ్డ, నల్లనువ్వులు, నువ్వుల నూనె, అగ్నిగుండం చుట్టూ ప్రదక్షిణ చేసి, అందులోకి వేస్తే సకల పాపాలు తొలగిపోతాయని వారి విశ్వాసం. ఈ ఉత్సవాలకు ఉమ్మడి అనంత జిల్లాతోపాటు తమిళనాడు, కర్ణాటక నుంచి అధిక సంఖ్యలో భక్తులు తరలివస్తారు.

నేటిలోగా అఫిడవిట్ దాఖలు చేయాలి

వ్యవసాయ శాఖకు హైకోర్టు ఆదేశం

వ్యవసాయ సహాయకుల పిటిషన్‌పై విచారణ రేపటికి వాయిదా

అనంతపురం అర్బన్, జూలై 23(ఆంధ్రజ్యోతి): వ్యవసాయ సహాయకుల బదిలీలకు సంబంధించిన విచారణను హైకోర్టు ఈనెల 25వ తేదీకి వాయిదా వేసింది. శ్రీసత్యసాయి జిల్లాలోని 11 మంది, అనంతలో ఇద్దరు, కర్నూలులో 20 మంది, ప్రకాశం, చిత్తూరు జిల్లాకు చెందిన మరి కొందరు వ్యవసాయ సహాయకులు తమకు బదిలీల్లో అన్యాయం జరిగిందని హైకోర్టును వేర్వేరుగా ఆశ్రయించారు. ఆయా జిల్లాల సిబ్బంది రిట్ పిటిషన్లపై హైకోర్టు వేర్వేరుగా స్టేటస్ కో ఆర్డర్లు జారీ చేసింది. ఆయా జిల్లాల సిబ్బందిది ఒకే సమస్య కావడంతో అందరి పిటిషన్లను కలిపి బుధవారం విచారణకు పిలిచింది. వ్యవసాయ శాఖ యంత్రాంగం కౌంటర్ (అఫిడవిట్) దాఖలు చేయలేదు. అఫిడవిట్‌ను గురువారం దాఖలు చేయాలని ఆదేశిస్తూ తదుపరి విచారణను శుక్రవారానికి హైకోర్టు న్యాయమూర్తి వాయిదా వేశారు.

కోర్టు ధిక్కారం తప్పదా..?

ఉమ్మడి అనంత జిల్లాకు సంబంధించి రైతు సేవాకేంద్రంలో పనిచేసే వ్యవసాయ సహాయకులకు గతనెల 28వతేదీ అనంత జేడీఏ కార్యాలయంలో కౌన్సెలింగ్ నిర్వహించారు. తమకు మంచి ర్యాంకు ఉన్నా.. అడిగిన స్థానాలు కేటాయించకుండా అన్యాయం చేశారని బాధితులు వాపోతున్నారు. ఈ నేపథ్యంలో శ్రీసత్యసాయి జిల్లాకు చెందిన 11 మంది వ్యవసాయ సహాయకులు పలుమార్లు కలెక్టర్, జేడీఏలను కలిసి విన్నవించారు. ఈ నేపథ్యంలో ఈనెల 14వ తేదీన 11 మంది హైకోర్టులో రిట్ పిటిషన్ వేశారు. ప్రస్తుతం సిబ్బంది పనిచేస్తున్న స్థానాల్లోనే రెండు వారాలపాటు కొనసాగించాలంటూ ఈనెల 15న హైకోర్టు రిట్ పిటీషన్‌పై స్టేటస్‌కో ఆర్డర్ ఇచ్చింది. ఇదే క్రమంలో సంబంధిత న్యాయవాది తరఫున పిటిషన్ దాఖలు చేసిన సిబ్బంది ఈనెల 17వ తేదీన అనంత జేడీఏ కార్యాలయంలో కోర్టు ఆర్డర్‌ను అందజేసినట్లు సమాచారం. తమకు కోర్టు ద్వారా నేరుగా ఉత్తర్వులు రాలేదన్న కారణంతో సంబంధిత ఉన్నతాధికారులు పట్టించుకోలేదని సమాచారం. హైకోర్టు ఉత్తర్వులు ఇచ్చిన రోజు నుంచి పిటిషన్ దాఖలు చేసిన సిబ్బంది స్థానాలు యథాతథంగా కొనసాగించేలా సంబంధిత ఎంపీడీఓలు, ఏడీఏలకు జేడీఏ కార్యాలయం నుంచి అధికారికంగా ఆర్డర్ పంపాల్సి ఉండగా... ఇప్పటిదాకా ఎలాంటి ఉత్తర్వులు జారీ చేయలేదని సమాచారం. ఈ నేపథ్యంలో కోర్టు ఉత్తర్వుల తర్వాత పటిషన్ దాఖలు చేసిన సిబ్బంది స్థానాల్లో కొత్త వారిని జాయిన్ చేసుకుని, పాత వారిని రిలీవ్ చేశారు. కర్నూలు జిల్లాలో పిటీషన్ దాఖలు చేసిన 20 మంది స్థానాలను యథాతథంగా కొనసాగించాలని ఆ జిల్లా జేడీఏ సంబంధిత ఎంపీడీఓలు, ఏడీఏలకు ఉత్తర్వులు జారీ చేశారు. దీంతో పిటిషన్ దాఖలు చేసిన సిబ్బంది స్థానాలను మార్చలేదు. ఉమ్మడి అనంత జిల్లాలో అందుకు విరుద్ధంగా సంబంధిత అధికారులు వ్యవహరించడాన్ని బుధవారం హైకోర్టు జడ్జి దృష్టికి వ్యవసాయ సహాయకుల తరఫు న్యాయవాది తీసుకెళ్లినట్లు సమాచారం. శుక్రవారం విచారణలో ఈ విషయం నిరూపితమైతే కోర్టు ధిక్కారం కేసు నమోదు చేస్తామని జడ్జి స్పష్టం చేసినట్లు తెలిసింది.

రైళ్లలో చోరీలపై నిఘా పెంచాలి

- సౌత్‌సెంట్రల్ రైల్వే డీఐజీ ఎండీఎస్‌జెడ్ ఖాన్

అనంతపురం న్యూటౌన్, జూలై 23(ఆంధ్రజ్యోతి): రైళ్లలో చోరీల నివారణకు మరింత నిఘా పెంచాల్సిన అవసరం ఎంతైన ఉందని సౌత్ సెంట్రల్ రైల్వే డీఐజీ ఎండీఎస్‌జెడ్ ఖాన్ సిబ్బందిని ఆదేశించారు. బుధవారం ఆయన అనంతపురం ఆర్పీఎఫ్ స్టేషన్‌ను తనిఖీ చేశారు. అందులో భాగంగా పలు రికార్డులను పరిశీలించారు. పలు చోరీల కేసులో రికవరీ చేసిన సామగ్రికి సంబంధించిన రిజిష్టరు, వస్తువుల గురించి అడిగి తెలుసుకున్నారు. అనంతరం సిబ్బందితో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. ప్రధానంగా విజిబుల్ పోలిసింగ్ ద్వారా చోరీలను అరికట్టడానికి అవకాశం ఉందన్నారు. అందుకు అనుగుణంగా తగిన చర్యలు చేపట్టాలని అన్నారు. సమావేశంలో డివిజనల్ సెక్యూరిటీ కమిషనర్ ఆకాశ్‌కుమార్ జెస్వాత్, సీఐ సుధాకర్‌రావు, ఎస్‌ఐ పవన్‌కుమార్‌రెడ్డి, ఏఎస్‌ఐలు మహమ్మద్ రఫీ, ప్రతాప్‌నాయక్ తదితరులు పాల్గొన్నారు.

హనుమాన్ దర్శన్ ప్రత్యేకం

బస్సు సర్వీసులు నడపనున్న ఆర్టీసీ

అనంతపురం టౌన్, జూలై 23(ఆంధ్రజ్యోతి): శ్రావణమాసంలోని మంగళ, శనివారాల్లో ఒకే రోజున మూడు ఆంజనేయస్వామి దేవాలయాలను దర్శించుకోవడం అనంతపురం జిల్లాలో ఆనవాయితీగా వస్తోంది. ఇందుకోసం ఏటా ఆర్టీసీ శ్రావణమాసంలో ప్రత్యేక బస్సు సర్వీసులను నడుపుతోంది. ఈ ఏడాది కూడా నడపనున్నట్లు అనంతపురం డీఎం నాగభూపాల్ వెల్లడించారు.

ఈనెల 26, 29, ఆగస్టు 2, 5, 9, 12, 16, 19 తేదీల్లో కసాపురం, మురడి, నేమకల్లు ఆంజనేయస్వామి దేవాలయాలను దర్శించుకునే భక్తులకోసం బస్సు సర్వీసులను నడపుతున్నట్లు పేర్కొన్నారు. మూడు ఆంజనేయస్వామి దేవాలయాలను ఒకేరోజున దర్శించుకునే వెసులుబాటు కల్పించారు. ముందస్తు రిజర్వేషన్ అవకాశం కూడా కల్పించినట్లు తెలిపారు.

పుణ్యఫలాలను ప్రసాదించే మాసం



శ్రావణం అత్యధికంగా పుణ్యఫలాలను ప్రసాదించే మాసం. ముత్తైదువులు ఈ మాసంలో అమ్మవారికి ముఖ్యంగా శ్రీచక్ర కుంకుమార్చన చేసుకోవడం వల్ల శుభఫలితాలను పొందుతారు.

- నరసింహశాస్త్రి, కాశీవిశ్వేశ్వర కోదండ దేవాలయం, అనంతపురం

విద్యాశాఖలో కలకలం

బోగస్ మెడికల్ సర్టిఫికెట్లపై ఫిర్యాదులు

12 మంది టీచర్లపై గుట్టుగా విచారణ

అనంతపురం విద్య, జూలై 23(ఆంధ్రజ్యోతి): బోగస్ మెడికల్ సర్టిఫికెట్లపై విచారణ విద్యాశాఖలో కలకలం రేపుతోంది. బదిలీల్లో అనుకూల స్థానాలు పొందేందుకు పలువురు టీచర్లు లేనిరోగాలను ఉన్నట్లు బోగస్ మెడికల్ సర్టిఫికెట్లు పెట్టారనే ఆరోపణలు వెల్లువెత్తాయి. అధికారిక లెక్కల మేరకు అన్ని కేడర్లలో కలిపి మే, జూన్ నెలల్లో చేపట్టిన బదిలీల్లో 422 మంది టీచర్లు వివిధ రకాల మెడికల్ సర్టిఫికెట్లతో ప్రిఫరెన్షియల్ కింద దరఖాస్తు చేసుకున్నారు. బదిలీలు పూర్తయి, వారికి కేటాయించిన స్థానాల్లో టీచర్లు చేరిపోయారు కూడా. ఇపుడు ఆ బోగస్ మెడికల్ సర్టిఫికెట్లపై విద్యాశాఖ గుట్టుగా విచారణ మొదలు పెట్టింది. ఉమ్మడి జిల్లావ్యాప్తంగా 12 మందిటీచర్లపై రాష్ట్రస్థాయి అధికారులకు ఫిర్యాదులు వెళ్లాయి. వారి మెడికల్ సర్టిఫికెట్లను పక్కాగా పరిశీలించి, వాస్తవ నివేదికలు పంపాలని కమిషనరేట్ నుంచి జిల్లా విద్యాశాఖకు ఆదేశాలు వచ్చాయి. ఆ మేరకు జిల్లా అధికారులు ఆ 12 మంది టీచర్ల మెడికల్ సర్టిఫికెట్లపై విచారణ సాగిస్తున్నారు. డిప్యూటీ డీఈఓలు మెడికల్ సర్టిఫికెట్లను తెప్పించుకుని, పరిశీలిస్తున్నారు. దీంతో టీచర్లలో టెన్షన్ మొదలైంది. పెద్దఎత్తున టీచర్లు బోగస్ మెడికల్ సర్టిఫికెట్లు పెడితే.. 12 మంది పైనే విచారణ చేయడం ఏంటని ఉపాధ్యాయ వర్గాలు మండిపడుతున్నాయి. ఏదిఏమైనా మెడికల్ సర్టిఫికెట్ల పరిశీలన జాబితాలో ఉన్న టీచర్లలో ఆందోళన నెలకొంది.

విచారణ చేస్తున్నాం: డీఈఓ

బదిలీల్లో ప్రిఫరెన్షియల్ కింద లబ్ధిపొందిన టీచర్ల మెడికల్ సర్టిఫికెట్లపై ఫిర్యాదులు వచ్చాయి. ఉమ్మడి జిల్లాలో 12మంది టీచర్ల సర్టిఫికెట్లపై విచారణ చేసి, నివేదిక ఇవ్వాలని రాష్ట్ర శాఖ నుంచి ఆదేశాలు జారీ అయ్యాయి. ఆ మేరకు ఆజాబితాలో ఉన్న టీచర్ల మెడికల్ సర్టిఫికెట్లను పునఃపరిశీలిస్తున్నాం. ఈ బాధ్యతలను ఆయా డిప్యూటీ డీఈఓలకు అప్పగించాం. విచారణ చేస్తున్నారు.

చినుకు పడితే... కునుకు కరువు..!

వరద వస్తే మునుగుతున్న కాలనీలు

15 ఏళ్ల క్రితం తెగిన ఆత్మకూరు చెరువు

వృథాగా పోతున్న చెరువునీరు

మరమ్మతులు పట్టని అధికారులు, పాలకులు


కాలనీ సమీపాన అధికారులు తెగ్గొట్టిన చెక్ డ్యాం

ఆత్మకూరు, జూలై23(ఆంధ్రజ్యోతి): వర్షాకాలం వచ్చిందంటే మండల కేంద్రంలోని పలు కాలనీల ప్రజలు ముంపు భయంతో వణికిపోతుంటారు. భారీ వర్షం కురిసినపుడల్లా కాలనీలు మునకే. ఏటా పలుమార్లు ఇదే దుస్థితి ఎదుర్కొంటున్నారు. మండల కేంద్రంలోనే ఉన్న చెరువు తెగిపోయి 15 ఏళ్లయింది. దీంతో భారీ వర్షం కురిసినపుడల్లా కాలనీల్లోకి భారీగా వరద నీరు వచ్చి చేరుతోంది. మండల కేంద్రంలోని ప్రధాన రహదారిపై పెద్దఎత్తున వరద ప్రవాహంతో వాహన రాకపోకలకు అంతరాయం ఏర్పడుతోంది. వర్షపు నీరు చెరువులో నిల్వ ఉండకుండా వచ్చినది వచ్చినట్లుగా వెళ్లిపోతుండడంతో భూగర్భ జలమట్టాలు తగ్గిపోతున్నాయనీ, వ్యవసాయ బోర్లు ఎండిపోతున్నాయని అన్నదాతలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా చెరువుకు మరమ్మతులు చేపట్టాలని కోరుతున్నారు. చెరువు తెగిపోయి, వరదంతా కిందనే ఉన్న చెక్ డ్యాంలోకి చేరుతోంది. ఆ నీరు కాలనీలను ముంచెత్తుతుండడంతో దానినీ తెగ్గొట్టారు. గత టీడీపీ హయాంలో చెరువు మరమ్మతులకు చర్యలు చేపట్టగా.. అప్పట్లో వైసీపీ నాయకులు అడ్డుపడినట్లు తెలుస్తోంది. తమ పార్టీ అధికారంలోకి రాగానే చెరువు మరమ్మతులు చేస్తామని ప్రగల్భాలు పలికినట్లు సమాచారం. 2019లో వైసీపీ అధికారంలోకి వచ్చి ఐదేళ్లు పాలించినా.. చెరువు మరమ్మతుల ఊసే ఎత్తలేదని మండల కేంద్రం వాసులు మండిపడుతున్నారు. ప్రస్తుతం కూటమి ప్రభుత్వం కొలువుదీరడంతో మరమ్మతులకు అడుగులు పడుతున్నాయని రాజకీయ వర్గాల ద్వారా తెలుస్తోంది.


గతేడాది పాత ఎస్సీ కాలనీలో నిలిచిన వర్షపునీరు

పట్టా భూములతోనే చిక్కులు


చెరువు మరమ్మతులు చేస్తే నీరు నిల్వ ఉంటుంది. ముంపు ప్రాంతం పట్టా భూములు కావడంతో మరమ్మతులు చేయడానికి ఆటంకాలు ఎదురవుతున్నాయి. టీడీపీ హయాంలో భూములకు పరిహారం ఇచ్చి, స్వాధీనం చేసుకునేలా సంబంధిత రైతులతో అధికారులు చర్చలు జరిపారు. రైతులు ముందుకు రాకపోవడంతో చెరువు మరమ్మతులు నిలిచిపోయాయి. ఆ తరువాత వైసీపీ పాలనలో పట్టించుకునే నాథుడే లేకుండాపోయాడు. రోడ్డుపై వర్షపునీటితో కష్టాలు పడ్డారు. ప్రస్తుతం వర్షాలు ప్రారంభమవడంతో స్థానికుల్లో భయం మొదలైంది. చెరువు మరమ్మతులు మాత్రం రైతులతో మాట్లాడి సానుకూలంగా సమస్య పరిష్కరించాలని గ్రామస్తులు కోరుతున్నారు.

కోతకు గురైన భూములు

వర్షపునీరు తెగిపోయిన చెరువు నుంచి అధికంగా రావడంతో చెరువు ప్రాంతంతో పాటు కింద ప్రాంతంలో భూమి కోతకు గురవుతోంది. మనిషిలోతు గోతి ఏర్పడి, ప్రమాదకరంగా మారింది. చెరువు కింద కాలువ భద్రత లేక అటు, ఇటు నర్సరీల్లోకి నీరు చేరుతోంది. ఇప్పటికైనా అధికారులు, ప్రజాప్రతినిధులు చెరువు మరమ్మతులు చేపట్టి వర్షపునీటిని అదుపుచేయాలని గ్రామ ప్రజలు కోరుతున్నారు.


తెగిన చెరువు కట్ట (ఫైల్)

వర్షపునీటిలో నడవాల్సిందే: శివారెడ్డి, ఆత్మకూరు



వర్షం వచ్చిందంటే ఇంటి చుట్టూ నీరు చేరుతోంది. బయటకు వెళ్లే అవకాశం కూడా ఉండదు. చెరువు నుంచి ఉధృతంగా వచ్చేనీరు మరింత ఇబ్బంది పెడుతుంది. పలుమార్లు అధికారులకు చెప్పినా ఫలితం లేదు. ఇప్పటికైనా అధికారులు చర్యలు చేపట్టాలి.

అనుమతులు లభించినా..

వర్షం వచ్చినపుడల్లా వరద నీటితో స్థానిక సర్దార్ వలి దర్గా దగ్గర తీవ్ర అసౌకర్యంగా ఉంటోంది. సమీప ఇళ్లను నీరు ముంచెత్తుతోంది. పాత ఎస్సీ కాలనీలోకి పెద్దఎత్తున నీరు చేరుతోంది. ప్రవాహం తగ్గేవరకు బయటకు రాలేని పరిస్థితి ఏర్పడుతోంది. వర్షపునీరు గతంలో అధికంగా రావడంతో సమీపాన 5 లక్షలతో నిర్మించిన చెక్ డ్యాంను అధికారులు ఎక్స్‌కవేటర్‌తో తెగ్గొట్టేశారు. ఇంత వరకు ప్రత్యామ్నాయ చర్యలు చేపట్టలేదు. వర్షాకాలం వస్తే.. చెరువు సమీపాన నివాసముండేవారు బిక్కుబిక్కుమంటూ గడపాల్సిందే. ఏళ్లుగా చెరువు మరమ్మతులు చేయాలని వినతి పత్రాలు అందజేసినా పట్టించుకునే నాథుడే కరువయ్యాడని గ్రామస్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పలుసార్లు మరమ్మతులు చేయాలని ప్రతిపాదనలు పంపి, అనుమతులు లభించినా పనులు ముందుకు సాగలేదు. దీంతో ప్రతిసారీ నిధులు వెనక్కి పోతున్నాయి. గ్రామానికి ఉన్న ఏకైక చెరువులో కూడా నీరు నిల్వ లేకపోవడంతో చుట్టుపక్కల భూగర్భ జలాలు పడిపోతున్నాయి. చివరికి చేతిపంపుల్లో నీరు రాక నిరుపయోగంగా మారాయి.

బిక్కుబిక్కుమంటూ గడపాల్సిందే..




వర్షాకాలం వస్తే రాత్రి వేళల్లో నిద్ర ఉండదు. ఇంటిల్లిపాదీ బిక్కుబిక్కుమంటూ గడపాల్సి వస్తుంది. మాగోడు పట్టించుకునేవారు లేరు. భారీ వర్షం వస్తే పెద్దఎత్తున వరద నీరు కాలనీని ముంచెత్తుతుంది. నెలరోజులైనా ఇంటి ముందు నీరు తగ్గదు. కాలనీలోకి వర్షపునీరు రాకుండా చర్యలు చేపట్టాలి. - సంధ్య, ఎస్సీ కాలనీ, ఆత్మకూరు

చెరువు మరమ్మతులకు చాలాసార్లు ప్రయత్నించాం

తెగిపోయిన చెరువు మరమ్మతులు చేయాలని గతంలో చాలాసార్లు ప్రయత్నాలు చేసినా ఫలితం లేదు. చెరువు ముంపు ప్రాంతం పట్టా భూమి. సంబంధిత రైతులతో చర్చలు జరిపినా కొలిక్కి రాలేదు. వరద ముంపు విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాం.

-కృష్ణకుమార్, ఇరిగేషన్ ఇంజనీర్

జీడిపల్లి వైపు కృష్ణమ్మ పరుగులు


రాగులపాడు వద్ద రెండు పంప్‌లతో కాలువకు విడుదల అవుతున్న నీరు

ఉరవకొండ, జూలై 23(ఆంధ్రజ్యోతి): వజ్రకరూరు మండలంలోని రాగులపాడు హంద్రీనీవా కాలువ వద్ద ఏర్పాటు చేసిన ఎత్తిపోతల పథకం నుంచి జీడిపల్లి రిజర్వాయర్‌కు బుధవారం అధికారులు నీటిని విడుదల చేశారు. ఈ నెల17న కర్నూలు జిల్లా మల్యాల వద్ద హంద్రీనీవాకు నీటిని వదలగా.. మంగళవారం అర్ధరాత్రి పంప్ హౌస్ వద్దకు చేరుకున్నాయి. మూడు మోటార్ల ద్వారా నీటిని ఎత్తిపోసి కాలువకు వదిలారు. 850 క్యూసెక్కుల దాకా నీటిని వదిలినట్లు అధికారులు తెలిపారు. కాలువకు నీరు రావడంతో రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. జిల్లాకు చేరుకున్న కృష్ణాజలాలకు హెచ్ఎన్ఎస్ఎస్ అధికారులు, టీడీపీ నాయకులు జల హారతి ఇచ్చారు. రాగులపాడు లిఫ్ట్ వద్ద అధికారులు పూజలు నిర్వహించి మోటార్లను ఆన్‌చేశారు. అనంతరం పంపుల వద్ద కృష్ణాజలాలకు అధికారులు, టీడీపీ నాయకులు పూజలు చేశారు. చిన్నముష్టూరు సమీపంలో కృష్ణాజలాల్లోకి పసుపు, కుంకుమ వదిలి పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో డీఈలు రమణ, నాగరాజు, ఏఈలు సురేష్, భాస్కర్, టీడీపీ నాయకులు దేవినేని పురుషోత్తం, విజయ్‌భాస్కర్, రామాంజనేయులు, తిమ్మప్ప, బీసీ మారెన్న, గోవిందు, గోనుగుంట్ల నాగేంద్ర, ఎర్రిస్వామి, మాజీ ఎంపీపీ సుంకరత్నమ్మ పాల్గొన్నారు.

ఫలించిన మంత్రి కృషి

హంద్రీనీవా కాలువ వెడల్పు పనులు పూర్తి కావడంతో నీటి ప్రవాహ సామర్థ్యం పెరగనుంది. జిల్లాలో మొదటి ఫేజ్ ప్యాకేజీ-2 పనులు పూర్తయ్యాయి. ఇరిగేషన్, రెవెన్యూ, ఏపీఎస్ఈబీ, హెచ్ఎన్ఎస్ఎస్ అధికారులను అప్రమత్తం చేస్తూ, సమీక్షలు నిర్వహిస్తూ, వంద రోజుల్లోనే పూర్తి చేస్తామని మంత్రి పయ్యావుల కేశవ్ చెప్పిన మాట నిలబెట్టుకున్నారు. సీఎం ఆదేశాలకు అనుగుణంగా మంత్రి ప్రత్యేక దృష్టిసారించి హెచ్ఎన్ఎస్ఎస్ కాలువ వెడల్పు పనులపై నీరు వచ్చేలోపు పూర్తి చేయాలని అధికారులు, కాంట్రాక్టర్లతో పనులు చేయించారు. దీంతో నీరు పారేందుకు ఎలాంటి ఆటంకాలు లేకుండా పోయాయి. గతంలో హెచ్ఎన్ఎస్ఎస్ కాలువలో 1300 నుంచి 1400 క్యూసెక్కుల నీరు ప్రవహిస్తుండగా.. వెడల్పు పనులు పూర్తి కావడంతో 3,200 నుంచి 3,450 క్యూసెక్కుల వరకూ నీరు కాలువలో ప్రవహించే అవకాశం ఉందని అధికారులు తెలిపారు. వీటితో పాటు తూముల ద్వారా చెరువులకు నీరు ఇవ్వడానికి అధికారులు చర్యలు తీసుకుంటున్నారు.

ఆటోడ్రైవర్లకు సామాజిక బాధ్యత అవసరం

- ఎస్పీ రత్న

పుట్టపర్తి రూరల్, జూలై 23(ఆంధ్రజ్యోతి): ఆటోడ్రైవర్లు సామాజిక బాధ్యతతో మెలగాలని ఎస్పీ రత్న సూచించారు. పుట్టపర్తిలోని సాయి ఆరామంలో బుధవారం ఆటోడ్రైవర్లకు భద్రత-బాధ్యత అనే అంశంపై అవగాహన సదస్సు, మెగా వైద్యశిబిరం నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిధిలుగా ఎస్పీ మాట్లాడుతూ.. నిత్యం అన్నిప్రాంతాలకు వెళ్లే ఆటోడ్రైవర్ల దృష్టికి సమాజంలో జరిగే ఎన్నో ఘటనలు వస్తాయన్నారు. అసాంఘిక కార్యకలాపాలు, వాటికి పాల్పడే వారి సమాచారాన్ని పోలీసులకు అందించడంలో ముందుండాలని ఎస్పీ సూచించారు. ఆటోడ్రైవర్లు.. ప్రయణికులను భద్రంగా గమ్యస్థానాలకు చేర్చాలన్నారు. వ్యసనాలకు దూరంగా ఉండాలని హితవు పలికారు. సత్యసాయి బాబా శతజయంతి ఉత్సవాలకు వచ్చే ఇతర రాష్ట్రాలు, దేశాల భక్తులతో మర్యాదగా మెలగాలని సూచించారు. నేరస్తుల సమాచారం ఇస్తే.. ఆటోడ్రైవర్లకు ప్రోత్సాహకాలు అందజేస్తామన్నారు. కార్యక్రమంలో జిల్లా వైద్యఆరోగ్య శాఖాధికారి డాక్టర్ ఫైరోజ్‌బేగం, డీఎస్పీ విజయ్‌కుమార్, ఎంవీఐ వరప్రసాద్, పుట్టపర్తి, నల్లమాడ, కొత్తచెరువు, పుట్టపర్తి రూరల్ సీఐలు సునీత, నరేందర్‌రెడ్డి, మారుతీశంకర్, సురేష్‌కుమార్, ఎస్ఐలు, వందలమంది ఆటోడ్రైవర్లు పాల్గొన్నారు.


ఆటోడ్రైవర్ల వైద్య శిబిరాన్ని ప్రారంభిస్తున్న ఎస్పీ రత్న

నేటి ప్రముఖులు

పోర్ట్రైట్ ఆర్టిస్ట్ కే.శే. శంకరనారాయణ కాలమ్...

అయ్యంకి వెంకట రమణయ్య (జయంతి)



'గ్రంథాలయ పితామహ'గా పేరొందిన అయ్యంకి వెంకట రమణయ్య 1890 జూలై 24న తూర్పు గోదావరి జిల్లా రామచంద్రపురం తాలూకా కొరుందురు గ్రామంలో జన్మించారు. గ్రంథాలయ ఉద్యమకారుడు, ఆయుర్వేదం, ప్రకృతి వైద్యంలో సిద్ధహస్తులు, పత్రికా సంపాదకులు. 1934-48 మధ్య కోస్తా, ఆంధ్రప్రాంతాలలో అనేక గ్రంథాలయాలు ఏర్పాటుచేశారు. సరస్వతీ రమారమణ, గ్రంథాలయ విశారద వంటి బిరుదులు అందుకున్నారు. 1979లో అయ్యంకి లైబ్రరీ కమిటీ ఏర్పాటై ఏటా ఉత్తమ గ్రంథాలయ కార్యకర్తను సత్కరిస్తోంది. 'పద్మశ్రీ' పురస్కారం అందుకున్నారు. 1979 మార్చి 7న దివంగతులయ్యారు.

మనోజ్ కుమార్ (జయంతి)



బాలీవుడ్‌లో ప్రముఖ నటుడిగా పేరొందిన మనోజ్‌కుమార్ 1937 జూలై 24న జన్మించారు. అసలు పేరు హరికిషన్ గిరి గోస్వామి. 1967లో ఆయన దర్శకత్వం వహించిన 'ఉపకార్' సినిమా బ్లాక్‌బస్టర్‌గా నిలిచింది. ఉత్తమ దర్శకుడిగా ఫిల్మ్‌ఫేర్ అవార్డు అందుకున్నారు. హిమాలయ్ కి గాడ్ మే, ఉప్‌కార్, రోటీ కపడా ఔర్ మకాన్, సన్యాసి, క్రాంతి వంటి సినిమాలు ఎంతో పేరొందాయి. 40ఏళ్ల కెరీర్‌లో పద్మశ్రీ, దాదాసాహెబ్ ఫాల్కే అవార్డు, ఫిల్మ్‌ఫేర్ లైఫ్ టైమ్ అచీవ్‌మెంట్ అవార్డుతోపాటు పలు పురస్కారాలు అందుకున్నారు. 2025 ఏప్రిల్ 4న కన్నుమూశారు.

శ్రీవిద్య (జయంతి)



శ్రీవిద్య 1953 జూలై 24న మద్రాస్‌లో జన్మించారు. కర్ణాటక సంగీత గాయని వసంత కుమారి కుమార్తె. మళయాళ, తమిళంలో పేరొందారు. కాగా తెలుగు, కన్నడ, మళయాళంలలో 800కుపైగా సినిమాలలో నటించారు. తన సినిమాలకు తానే డబ్బింగ్ చెప్పుకొనేవారు. తల్లి ప్రోత్సాహంతో నేపథ్య గాయనిగాను రాణించారు. బుల్లితెరపైనా, వెండితెరపైనా రాణించారు. ఉత్తమనటిగా పలు పురస్కారాలు, కళైమామణి, కేరళ రాష్ట్ర సినీ అవార్డులు, తమిళనాడు రాష్ట్ర సినిమా అవార్డులు, ఫిల్మ్‌ఫేర్ అవార్డులు ఇతర పురస్కారాలు అందుకున్నారు. 2006 అక్టోబరు 19న కన్నుమూశారు.

అజీం ప్రేమ్‌జీ (పుట్టినరోజు)



విప్రో సంస్థ ఛైర్మన్, 'పద్మ విభూషణ్' గ్రహీత అజీం హాషం ప్రేమ్‌జీ 1945 జూలై 24న బాంబేలో జన్మించారు. ప్రముఖ వ్యాపారవేత్త. వంటనూనెల ఉత్పత్తితో కెరీర్‌ను ప్రారంభించి దేశంలో ప్రముఖ ఐటీ సంస్థగా ఎదిగేలా కృషి చేశారు. స్వచ్ఛంద సంస్థను ఏర్పాటుచేసి గ్రామీణప్రాంతాలలో విద్యాభివృద్ధికి పాటు పడుతూ పలు సామాజిక సేవలందిస్తున్నారు. వారెన్ బఫెట్, బిల్‌గేట్స్ వంటి ప్రముఖులతో ఒప్పందం చేసుకున్నారు. పద్మశ్రీ, పద్మభూషణ్, పద్మవిభూషణ్ వంటి ఉన్నత పురస్కారాలు అందుకున్నారు. 2020లో నేషనల్ సెంటర్ ఫర్ బయలాజికల్ సైన్సెస్‌తో కలసి పలు పరిశోధనలకు సహకారం అందించారు.

కేటీ రామారావు (పుట్టినరోజు)



కల్వకుంట్ల తారక రామారావు (కేటీఆర్) 1976 జూలై 24న సిద్దిపేటలో జన్మించారు. తెలంగాణ మాజీ ముఖ్యమంత్రి కే చంద్రశేఖర్‌రావు కుమారుడు. ప్రస్తుతం భారత్ రాష్ట్ర సమితి (బీఆర్ఎస్) పార్టీ ఛైర్‌పర్సన్‌గా వ్యవహరిస్తున్నారు. తెలంగాణ రాష్ట్ర అర్బన్ డెవలప్‌మెంట్, మునిసిపల్ అడ్మినిస్ట్రేషన్, ఐటీ, ఇండస్ట్రీస్ అండ్ కామర్స్ శాఖల మంత్రిగా వ్యవహరించారు. 2015లో సీఎన్ఎన్ ఐబీఎన్‌చే మోస్ట్ ఇన్‌స్పిరేషనల్ ఐకాన్ ఆఫ్ ది ఇయర్ అవార్డు, స్కాచ్‌చే ఐటీ మినిస్టర్ ఆఫ్ 2017 అవార్డు అందుకున్నారు.

పంకజ్ అద్వాని (పుట్టినరోజు)



'పద్మవిభూషణ్' గ్రహీత పంకజ్ అర్జున్ అద్వాని 1985 జూలై 24న పూనెలో జన్మించారు. బిలియర్డ్స్, స్నూకర్ గేమ్‌లో 27సార్లు వరల్డ్ చాంపియన్ అందుకున్నారు. ఏసియన్ అండ్ వరల్డ్ చాంపియన్‌షిప్స్‌లో అన్ని ఫార్మాట్‌లలో వరుసగా అత్యధిక అవార్డులు అందుకున్న ఏకైక వ్యక్తి. 18 బిలియర్డ్స్ వరల్డ్ టైటిల్స్ అందుకున్నారు. 2004లో అర్జున, 2006లో రాజీవ్ ఖేల్‌రత్న, 2009లో పద్మశ్రీ, 2018లో పద్మ విభూషణ్ పురస్కారం అందుకున్నారు. ఇంకా పలు టైటిల్స్, అవార్డులు పొందారు.

'ప్రత్యామ్నాయ పంటలపై దృష్టి సారించాలి'

అగళి, జూలై 23(ఆంధ్రజ్యోతి): రైతులు ప్రత్యామ్నాయ పంటలపై దృష్టిసారించాలని జడ్పీటీసీ ఉమేష్, వ్యవసాయశాఖ అధికారి నాగరాజు సూచించారు. అగళి మండల కేంద్రంలో బుధవారం ప్రత్యామ్నాయ పంటలకు సంబంధించిన విత్తనాలను పంపిణీ చేశారు. కందులు, రాగులు, మినుములు, సంచులు రైతులకు అందజేశారు. అనంతరం వారు మాట్లాడుతూ రైతు సేవా కేంద్రాల్లో వీటిని పంపిణీ చేయడం జరుగుతోందని, రైతులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. అర్హత ఉన్న ప్రతి రైతు వచ్చి తీసుకెళ్లాలన్నారు.

విద్యుత్ సమస్యను పరిష్కరించండి

ట్రాన్స్‌కో ఏఈకి రాగిమేకపల్లి వాసుల వినతి

రొద్దం, జూలై 23(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని రాగిమేకపల్లి గ్రామంలో రాత్రి సమయంలో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడుతోందని, సమస్యను పరిష్కరించాలని ట్రాన్స్‌కో ఏఈ శ్రీనివాసమూర్తికి గ్రామస్థులు విన్నవించారు. బుధవారం రొద్దంలోని ట్రాన్స్‌కో కార్యాలయంలో ఏఈని కలిసి విద్యుత్ సమస్యను పరిష్కరించాలని కోరారు. రాత్రిపూట విద్యుత్ సరఫరా కాకపోవడంతో ఇబ్బందులకు గురి అవుతున్నామని, సమస్య పునరావృతం కాకుండా చూడాలని కోరారు. సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని ఏఈ వారికి హామీ ఇచ్చారు.

పరిశ్రమల ఏర్పాటుకు యాక్షన్‌ప్లాన్ సిద్ధం చేయండి

» అధికారులకు ఎమ్మెల్యే సూచన

బాగేపల్లి, జూలై 23 (ఆంధ్రజ్యోతి): దేవనహళ్ళి తాలూకాలో భూస్వాధీన ప్రక్రియను వీడడంతో పరిశ్రమలను బాగేపల్లి తాలూకాకు అవకాశం కల్పించాలని ప్రభుత్వాన్ని కోరినట్టు ఎమ్మెల్యే ఎస్ఎన్ సుబ్బారెడ్డి తెలిపారు. తాలూకా పంచాయతీ సభాంగణంలో బుధవారం కేఐఏడీబీ అధికారులు, రైతులతో ప్రత్యేకంగా సమావేశం నిర్వహించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ పరిశ్రమల ఏర్పాటుకోసం కొండరెడ్డిపల్లి, హొసహుడ్య గ్రామాలలో 624 ఎకరాలను కేఐఏడీబీ స్వాధీనం చేసుకుందని, ఇందులో 428 ఎకరాలు ప్రభుత్వ, 196 ఎకరాలు రైతుల భూమి ఉందన్నారు. భూస్వాధీన ప్రక్రియకు సంబంధించి రైతులలో ఉన్న గందరగోళాన్ని తొలగించేందుకు సమావేశం నిర్వహించినట్టు తెలిపారు. తాలూకాలో పరిశ్రమల ఏర్పాటు సాధ్యం కానిపక్షంలో సరిహద్దులోని లేపాక్షి సమీపాన భూములు ఇచ్చేందుకు సిద్ధంగా ఉన్నామని ఏపీ సీఎం చంద్రబాబునాయుడు సుముఖంగా ఉన్నారన్నారు. తాలూకా పరిధిలోని గ్రామీణ ప్రాంతాలలో పరిశ్రమల ఏర్పాటు ద్వారా వేలాదిమందికి, గ్రామీణులకు ఉద్యోగ, ఉపాధి సాధ్యమన్నారు. ఇందుకు సంబంధించి అధికారులు యాక్షన్‌ప్లాన్ సిద్ధం చేసి ప్రభుత్వానికి ప్రస్తావనలు సమర్పించాలన్నారు. సమావేశంలో గ్యారెంటీ అమలు కమిటీ తాలూకా అధ్యక్షుడు హెచ్ఎస్ నరేంద్ర, కేఐఏడీబీ కార్యదర్శి హరీశ్ శిల్ప, తహశీల్దార్ మనిషా మహేశ్ ఎస్ పత్రి, ఈఓ రమేశ్, హొసహుడ్య, కొండరెడ్డిపల్లి గ్రామాలకు చెందిన రైతులు తదితరులు పాల్గొన్నారు.



రైతులతో సమావేశంలో ఎమ్మెల్యే సుబ్బారెడ్డి తదితరులు

త్రిభాషా సూత్రం కొనసాగించాలి



క్రీడా పోటీల ప్రారంభోత్సవంలో ఎమ్మెల్యే సమృద్ధి మంజునాథ్

ముళబాగిలు, జూలై 23(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో త్రిభాషాసూత్రాన్ని కొనసాగించాలని, ఎట్టి పరిస్థితుల్లోనూ హిందీని వదులుకోరాదని కోరుతూ ఆగస్టు 11నుంచి జరిగే శాసనసభ సమావేశాల్లో తన అభిప్రాయం వ్యక్తం చేస్తానని ఎమ్మెల్యే సమృద్ధి మంజునాథ్ తెలిపారు. తాలూకాలోని హెచ్ గొల్లహళ్ళి ప్రభుత్వ ఎయిడెడ్ ఎస్‌వీవీ హైస్కూల్ ఆవరణలో విద్యాశాఖ ఏర్పాటు చేసిన దుగ్గసంద్ర హోబళిస్థాయి క్రీడా పోటీలను బుధవారం లాంచనంగా ప్రారంభించారు. హిందీ జాతీయ భాష అని ప్రతి ఒక్కరికీ కూడా ఈ భాష అవసరం ఉందని, రాష్ట్ర ప్రభుత్వం ఈ అంశాన్ని తీవ్రంగా పరిగణించాలని కోరుతున్నట్టు తెలిపారు. రాష్ట్రంలో ప్రభుత్వం క్రికెట్‌కు ఇస్తున్న ప్రాధాన్యత ఖోఖో, కబడ్డీ, తదితర క్రీడలకు తగిన ప్రాధాన్యత ఇవ్వలేదని అసంతృప్తి వ్యక్తం చేశారు. క్రీడల్లో గెలుపోటలతో నిమిత్తం లేకుండా విద్యారుథలు పాల్గొనాలని పిలుపునిచ్చారు. కాగా ఇటీవల ఉపాధ్యాయులు సైతం గ్రూపులు కట్టడం మంచి పరిణామం కాదని అభిప్రాయపడ్డారు. కార్యక్రమంలో డీసీసీ బ్యాంకు డైరెక్టర్ రఘుపతిరెడ్డి, కోముల్ డైరెక్టర్ బీవీ శామేగౌడ, విద్యాసంస్థ అధ్యక్షుడు శ్రీనివాస్, ప్రధానోపాధ్యాయుడు వెంకటరామప్ప స్థానిక ప్రముఖులు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా గ్రామదేవతల జాతర

శిడ్లఘట్ట, జూలై 23(ఆంధ్రజ్యోతి): తాలూకాలోని తుమ్మనహళ్ళి పంచాయతీ పరిధిలోని సొరకాయలహళ్ళిలో ఇదే తొలిసారిగా గ్రామదేవతల జాతర ఘనంగా జరిగింది. ఏడుగురు గ్రామదేవతలు గంగమ్మ, నెరడమ్మ, సప్పలమ్మ, పూజమ్మ, అష్టమూర్తమ్మ, చౌడేశ్వరిదేవి, కాళికాంబదేవిలను ఆషాఢమాసం పురస్కరించుకుని పురవీధులలో ఊరేగించారు. మహిళలు, యువతులు కళశాలతో ఊరేగారు. జాతరతో ఎటుచూసినా సంబరం నెలకొంది. ఉత్సవ మూర్తులను ట్రాక్టర్‌లో పురవీధులలో ఊరేగించారు. గ్రామపెద్దలు, యువకులు, చుట్టుపక్కల ప్రాంతాలనుంచి పెద్దసంఖ్యలో వచ్చిన భక్తులకు తీర్థప్రసాదాలు, అన్నదానం నిర్వహించారు.



కలశాలతో యువతులు



పురవీధుల్లో ఊరేగింపు

బీఎన్‌ఎం కళాశాలలో ఎఫ్‌డీపీ సదస్సు

బెంగళూరు, జూలై 23(ఆంధ్రజ్యోతి): బీఎన్ఎం ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ కళాశాలలో రాబర్ట్ బోష్ ఇంజనీరింగ్ బిజినెస్ సొల్యూషన్స్ సంస్థలు సంయుక్తంగా అటల్ ఫ్యాకల్టీ అభివృద్ధి కార్యక్రమాన్ని (ఎఫ్‌డీపీ) నిర్వహించారు. రానున్న తరాలకు సెల్ఫ్ డ్రైవింగ్ కార్లకు కృత్రిమ మేథస్సు అనే అంశంపై ఆరు రోజుల సదస్సు కొనసాగుతోంది. బోష్ గ్లోబల్ సాఫ్ట్‌వేర్ టెక్నాలజీస్ అసోసియేట్ టెక్నికల్ డైరెక్టర్ గురుమూర్తి అర్కశాలి సదస్సును ప్రారంభించి విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడారు. తక్కువ వేగంతో నడిచే వాహనాలు కెమెరా, లిడార్ ఆధారిత వ్యవస్థలను బోష్‌లో నిర్వహిస్తున్నామన్నారు. సాంకేతిక తరంలో ఉన్న విద్యార్థులు అందుకు అనుగుణంగా నిత్యం అవగాహన పొందాలని సూచించారు.



సదస్సులో పాల్గొన్న ప్రముఖులు

నైపుణ్యంతోనే ఉజ్వల భవిష్యత్తు

బెంగళూరు, జూలై 23 (ఆంధ్రజ్యోతి): ప్రస్తుత పోటీ ప్రపంచంలో చదువుతోపాటు నైపుణ్యం కూడా ఉంటేనే ఉజ్వల భవిష్యత్తు సాధ్యమని గ్రీన్‌స్కిల్స్ సెంటర్స్ ఆఫ్ ఎక్సలెన్స్ నిర్వాహకులు అభిప్రాయపడ్డారు. 6వ తరగతి నుంచి 12వ తరగతి వరకు 1200మంది విద్యార్థులకు ఇవై గ్లోబల్ డెలివరీ సర్వీసెస్, లర్నింగ్ లింక్స్ ఫౌండేషన్ సహకారంతో ప్రత్యేక నైపుణ్య శిబిరం నిర్వహించారు. ప్రత్యేకించి ఏఐ టెక్నాలజీ సాంకేతిక ప్రయోజనాలపై అవగాహన పెంచుకుని ప్రయోజనం పొందాలని సూచించారు. ఇవై జీడీఎస్ సీఎస్ఆర్ విభాగం డైరెక్టర్ రూమి మలిక్, విద్యాశాఖ డిప్యూటి డైరెక్టర్ (పాలనా విభాగం) వివేకానంద, (అభివృద్ధి) విభాగం డిప్యూటి డైరెక్టర్ శివప్ప, బీఈఓ గోవిందప్ప, లర్నింగ్ లింక్స్ ఫౌండేషన్ అధ్యక్షురాలు నూరియ అన్సారి తదితరులు పాల్గొన్నారు.



విద్యార్థినికి ప్రశంసాపత్రం అందిస్తున్న దృశ్యం

యాంత్రీకరణ పద్ధతులతో అధిక దిగుబడులు

మడకశిర రూరల్, జూలై 23(ఆంధ్రజ్యోతి): వ్యవసాయ సాగులో యాంత్రీకరణ పద్ధతులను అనుసరిస్తే అధిక దిగుబడులు సాధ్యమని ఆచార్య ఎన్‌జీ రంగా వ్యవసాయ ఇంజనీరింగ్ కళాశాల అసోసియేట్ డీన్ డాక్టర్ సరోజినీదేవి అన్నారు. భారత వ్యవసాయ పరిశోధనా మండలి న్యూఢిల్లీ సౌజన్యంతో కళాశాలలో ఆముదం పంట సాగుపై ఆర్ అనంతపురం చీపులేటీ, రేకులకుంట, గౌడనహళ్లి గ్రామాలకు చెందిన 36 మంది ఎస్సీ రైతులకు అవగాహన నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ సరోజనిదేవి ఎస్సీ రైతులకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అందిస్తున్న సంక్షేమ పథకాలను వివరించారు. అనంతరం హైబ్రిడ్ ఆముదం విత్తనాలను ఉచితంగా పంపిణీచేశారు. కార్యక్రమంలో ప్రాజెక్ట్ సమన్వయకర్త డాక్టర్ శ్రీగిరి, వ్యవసాయ యాంత్రీకరణ విభాగం అధిపతి డాక్టర్ హరిబాబు, బోధనా సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

వైసీపీ నేతలవి అసత్య ఆరోపణలు

- ఆ పార్టీ ఐదేళ్ల పాలనలో చేయని అభివృద్ధి ఏడాదిలో చేసి చూపించాం
- బురద జల్లడం మానుకోవాలి
- ఎమ్మెల్యే ఎంఎస్ రాజు



శ్వేతపత్రం విడుదల చేస్తున్న ఎంఎస్ రాజు, గుండుమల తిప్పేస్వామి

మడకశిర టౌన్, జూలై 23(ఆంధ్రజ్యోతి): వైసీపీ నాయకులు చేస్తున్న తప్పుడు ప్రచారాలను నమ్మవద్దని, గత వైసీపీ ఐదేళ్లపాలన చేయలేని అభివృద్ధిని ఏడాదిలో చేసి చూపామని ఎమ్మెల్యే ఎంఎస్ రాజు అన్నారు. కూటమి ప్రభుత్వంలో కక్షసాధింపులు ఉంటే వైసీపీ నేతలు బయట ఉండేవారాఅని ప్రశ్నించారు. బుధవారం క్యాంపు కార్యాలయంలో టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షులు గుండుమల తిప్పేస్వామితో కలిసి మాట్లాడారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ముఖ్యమంత్రి నారాచంద్రబాబునాయుడు, డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్, మంత్రి నారాలోకేశ్‌పై అసత్య ఆరోపణలు, అవాక్కులు, చవాక్కులు పేలితే సహించేది లేదన్నారు. ఏడాదిలోనే 10,710కోట్లతో అభివృద్ధి కార్యక్రమాలు నియోజకవర్గంలో చేపట్టామని, అందుకు సంబంధించి బహిరంగా చర్చకు సిద్ధమా అంటూ సవాల్ విసిరారు. ఏడాది పాలనపై చేసిన అభివృద్ధికి సంబంధించి త్వరలో శ్వేత పత్రం విడుదల చేస్తామని తెలిపారు. అవగాహన లేని మడకశిర వైసీపీ సమన్వయ కర్త ఈరలక్క తప్పుడు ఆరోపణలు చేయడం సరికాదన్నారు. హోంమంత్రి పర్యటన విజయంతం అయితే జీర్ణించుకోలేక అసత్య ఆరోపణలు చేస్తున్నారంటూ మండిపడ్డారు. వైసీపీ నాయకులు బహిరంగా చర్చకు వస్తే తానే వచ్చి గత ఐదేళ్ల వైసీపీ హయాంలో అవినీతి, అక్రమాలను వివరిస్తానన్నారు. ఆ అవినీతిని కప్పించుకోనేందుకు తమపై తప్పుడు ప్రచారం చేస్తే ఊరుకోమని హెచ్చరించారు. మీ పార్టీకి చెందిన మీ జడ్పీటీసీ మీ వైసీపీ నేతలపై ఎస్సీ ఎస్టీ అట్రాసిటీ కేసు పెడితే మేము అందులో జోక్యం చేసుకోలేదని, తమపై ఆరోపణలు మానుకోవాలని హితవుపలికారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక నియోజకవర్గంలో 600 విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లు పంపిణీ చేశామన్నారు. మీ హయాంలో ఒక్క ట్రాన్స్‌ఫార్మర్‌కు రూ.50వేల నుంచి లక్ష చొప్పున వసూలు చేయలేదా అంటూ ప్రశ్నించారు. నేషనల్ హైవే, వక్క మార్కెట్‌కు 10 ఎకరాల భూమి కేటాయించి ఆగస్టులో వ్యవసాయశాఖ మంత్రి శంకుస్థాపన చేస్తారన్నారు. 10 శాతం స్టేడియం పనులు 5 ఏళ్లలో పూర్తి చేయలేదని, కేవలం తాను ఎమ్మెల్యే అయ్యాక 3 నెలలో పూర్తి చేసి ప్రారంభించడం జరిగిందన్నారు. నగర పంచాయతీ పరిధిలో కోటి రూపాయలతో సీసీ రోడ్లు నిర్మాణం పూర్తికాగా, అహుడా లే అవుట్ వర్క్ రూ. 5కోట్లతో టెండర్ పూర్తి అయినట్లు తెలిపారు. గత ఐదేళ్లలో ఏ పంచాయతీకి మీరు రూపాయి నిధులు ఇవ్వలేదని, కూటమి ప్రభుత్వం వచ్చాక ప్రతి పంచాయతీకి రూ. 5.10కోట్లు పంచాయతీ రాజ్ శాఖ మంత్రి పవన్ కల్యాణ్ కేటాయించడం జరిగిందన్నారు. హాస్టళ్లలో సదుపాయాల కోసం 5 మండలాల పరిధిలో రూ. కోటి టెండర్లు పిలిచామని అన్నారు. గురుకుల పాఠశాలలు నిర్మాణం 80శాతం పూర్తి అయిన తక్కిన పనులు పూర్తి చేయలేని అసమర్థులు వైసీపీ నాయకులు అని అన్నారు. రూ. 2కోట్లతో అగళి, అమరాపురంలో ఆసుపత్రుల నిర్మిస్తుంటే వైసీపీ కళ్లు కనబడడం లేదా అన్నారు. మడకశిర నియోజకవర్గం వ్యాప్తంగా రూ. 15కోట్లతో గ్రామాలలో సీసీ రోడ్లు వేస్తే వైసీపీ నేతలకు, జగన్ పత్రికకు కనపించలేదని ఎద్దేవా చేశారు. ప్రజలకు అబద్దాలు చెప్పడమే వైసీపీ నాయకులు లక్ష్యంగా పెట్టుకున్నారని ఆరోపించారు. మందుగుండు పరిశ్రమ నిర్మాణానికి ప్రభుత్వం ఇప్పటికే పచ్చజెండా ఊపిందని, సెప్టెంబరులో ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, కేంద్ర హోంమంత్రి కూడా పర్యటించే అవకాశాలు ఉన్నాయని, వారి చేతుల మీదుగా శంకుస్థాపన జరుగుతుందన్నారు. ఈ సందర్భంగా టీడీపీ రాష్ట్ర కార్యదర్శి డాక్టర్ శ్రీనివాస్‌మూర్తి తదితరులు ఉన్నారు.

వీధి దీపాలకు మరమ్మతులు

నగరంలో నిత్యం రద్దీగా ఉండే ప్రాంతాలలో విధానసౌధ ఒకటి. ఇటీవల వర్షాల కారణంగా సమీపంలోని గోపాలగౌడ సర్కిల్‌లో వీధి దీపాలు సక్రమంగా పనిచేయకపోవడంపై అధికారులు స్పందించారు. బుధవారం నిర్వహణాపనులు చేపట్టి బాగుచేశారు. కాగా పలుచోట్ల ట్రాఫిక్ సిగ్నల్స్ కొత్తవి ఏర్పాటు చేసినప్పటికీ కొన్నిచోట్ల చెట్లకొమ్మలు అడ్డు వస్తుండడంతో ఇబ్బందిగా ఉందని, అడ్డుగా ఉన్న కొమ్మలను తొలగించాలని వాహన దారులు కోరుతున్నారు.

(బెంగళూరు, ఆంధ్రజ్యోతి)



గోపాలగౌడ సర్కిల్‌లో...

బ్రిగేడ్ హోటల్ వెంచర్స్ ఐపీఓ..

బెంగళూరు, జూలై 23(ఆంధ్రజ్యోతి): పెట్టుబడుల సాధనకోసం బ్రిగేడ్ హోటల్ వెంచర్స్ లిమిటెడ్ ఐపీఓలోకి చేరిన్నల ప్రకటించారు. ఈనెల 24నుంచి 28వరకు అవకాశం ఉందని 10 రూపాయల విలువైన షేర్‌ను రూ.85-90 దాకా నిర్ధారించామని సంస్థ ఎండీ నిరుపాశంకర్ ప్రకటించారు. కంపెనీ ముఖ్యులతో కలసి బుధవారం బెంగళూరులో ప్రకటించారు. బిడ్ చెల్లించేవారు కనీసం 166 ఈక్విటీ షేర్లకు అవకాశం ఉందన్నారు. ఉద్యోగులకు బిడ్ చెల్లింపులలో ప్రతి షేర్‌కు రూ.3 రాయితీ ఇస్తున్నామన్నారు. 10రూపాయల ముఖ విలువ కల్గిన షేర్లను మొత్తం 759 కోట్ల విలువైన షేర్లను సంస్థ కొత్తగా విడుదల చేస్తోందన్నారు. జేఎం ఫైనాన్షియల్ లిమిటెడ్, ఐసీఐసీఐ సెక్యూరిటీస్ లిమిటెడ్ కంపెనీలు ఈ ప్రక్రియలో బుక్‌రన్నింగ్ లీడ్ మేనేజర్ బాధ్యతను నిర్వహిస్తాయన్నారు.

నైపుణ్య శిక్షణకు కోర్సులు

బెంగళూరు, జూలై 23(ఆంధ్రజ్యోతి): మేధావి స్కిల్స్ యూనివర్సిటీ, బార్బిక్యూ నేషన్‌తో కలిపి బి ఓక్, డి ఓక్ కోర్సులను పరిచయం చేస్తున్నట్టు కులపతి ప్రవేశ్‌దుదాని ప్రకటించారు. 10 లేదా 12వ తరగతులు చదివి మానేసిన వారికి డిప్లమో ఆఫ్ ఒకేషన్, బ్యాచిరల్ ఆఫ్ ఒకేషన్ వంటి హాస్పిటాలిటీ, రెస్టారెంట్‌లో ఉద్యోగాలు కల్పించే శిక్షణలు ఇవ్వదలిచామన్నారు. 200మంది విద్యార్థులను ఎంపిక చేసి బెంగళూరు, చెన్నై, హైదరాబాద్‌లలో శిక్షణ ఇస్తామన్నారు. బార్బిక్యూ నేషన్ సీఈఓ రాహల్ అగర్వాల్ మాట్లాడుతూ నైపుణ్యత నేర్పించి ఉద్యోగాలు ఇవ్వడమే తమ ఆశయమన్నారు.

ఆదర్శప్రాయుడు బాలగంగాధర్ తిలక్



బాలగంగాధర్ తిలక్ చిత్రపటం వద్ద నివాళి అర్పిస్తున్న ఉపాధ్యాయులు

బాగేపల్లి, జూలై23(ఆంధ్రజ్యోతి): 'స్వరాజ్యం నా జన్మహక్కు' అనే నినాదంతో స్వాతంత్ర్య సంగ్రామంలో ప్రజలను చైతన్యపరిచిన బాల గంగాధర్ తిలక్ ఆదర్శప్రాయులని వక్తలు పేర్కొన్నారు. తాలూకాలోని కారకూరు బ్లూమ్ ఇంటర్నేషనల్‌స్కూల్‌లో బుధవారం బాల గంగాధర్ తిలక్ 169వ జయంతిని అర్థవంతంగా నిర్వహించారు. ప్రిన్సిపాల్ డాక్టర్ మంజుళా హాళకట్టి మాట్లాడుతూ స్వాతంత్ర్య పోరాటంలో ప్రజలను చైతన్యపరిచి లోకమాన్యగా పేరొందారన్నారు. శ్రీనివాస్‌తంత్రి మాట్లాడుతూ స్వదేశీ ఉద్యమాన్ని తిలక్ ప్రోత్సహించారని, సంఘసంస్కర్తగా, జాతీయనేతగా గుర్తింపు పొందిన వ్యక్తిత్వానికి ఎవరూ సాటిరారన్నారు. కార్యక్రమంలో పాలకవర్గం అధ్యక్షుడు డాక్టర్ గోవిందరాజు, అశ్విని, విద్యార్థులు పాల్గొన్నారు.

కంప్యూటర్ పరిజ్ఞానం అవసరం



శిక్షణ పొందిన విద్యార్థులు

హోస్పేట, జూలై 23(ఆంధ్రజ్యోతి): పోటీ ప్రపంచం లో కంప్యూటర్ పరిజ్ఞానం అందరికీ అవసరమని రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ రమేష్ అన్నారు. బుధవారం హగరి బొమ్మనహళ్లి తాలూకా ఉపనాయకనహళ్లి గ్రామంలో ఎస్ఎల్ఆర్ మెటాలిక్స్, చైతన్య గ్రామీణ అభివృద్ధి విద్యా ట్రస్ట్(ఆర్ఈ) సహకారంతో ఉచిత కంప్యూటర్ శిక్షణ పొందిన విద్యార్థులకు సర్టిఫికెట్ల పంపిణీ కార్యక్రమంలో రమేష్ పాల్గొని ప్రసంగించారు. గ్రామీణ యువతీ, యువకులు కంప్యూటర్ విద్యకు దూరమవుతున్నారని అన్నారు. కంప్యూటర్ పరిజ్ఞానం లేకుండా ఉపాధి పొందలేకపోతున్నారన్నారు. ఎంత చదువుకున్నా కంప్యూటర్ పరిజ్ఞానం లేకపోతే నిరక్షరాస్యులే అన్నారు. ఉన్నత విద్యతోపాటు కంప్యూటర్ పరిజ్ఞానం అవసరమన్నారు. పేదలు పట్టణ ప్రాంతాలకు వెళ్లి కంప్యూటర్ విద్యకు డబ్బులు చెల్లించడం కష్టమని ఇక్కడే శిక్షణ ఇస్తున్నామని ఆయన అన్నారు. గ్రామ పంచాయతీ సభ్యుడు హనమంతప్ప, ఆరోగ్య శాఖ అధికారి సోమశేఖర్, ఎస్ఎల్ఆర్ మెటాలిక్స్ కంపెనీ ఐటీ విభాగం సిబ్బంది పాల్గొన్నారు.

కేరళ మాజీ ముఖ్యమంత్రికి ఘన నివాళి

పెనుకొండ, జూలై 23(ఆంధ్రజ్యోతి): కేరళ మాజీ ముఖ్యమంత్రి అచ్యుతానందన్ మృతికి స్థానిక సీఐటీయూ, సీపీఎం నాయకులు ఘననివాళులు అర్పించారు. బుధవారం స్థానిక సీఐటీయూ కార్యాలయంలో సీపీఎం నాయకులు హరి, నాయకులు అచ్యుతానందన్ చిత్రపటానికి పూలమాలలువేసి నివాళులు అర్పించారు. ఆయన ఆశయాలు కొనసాగించేందుకు కృషిచేయాలన్నారు. కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు బాబావలి, తిప్పన్న, నరసింహులు, ఆనంద్ తదితరులు పాల్గొన్నారు.



తుంగభద్ర నీటి మట్టం : 1633 అడుగులు

	ప్రస్తుతం	గత ఏడాది
నీటి మట్టం (అడుగులు)	1626.03	1621.32
ఇన్‌ఫ్లో (క్యూసెక్కులు)	38,079	1,07,198
ఔట్ ఫ్లో (క్యూసెక్కులు)	39,009	1,267
నీటి నిల్వ (టీఎంసీలు)	79.90	65.11

ఊపందుకున్న వరినాట్లు



మోకా సమీపంలో నాట్లు వేస్తున్న కూలీలు

బళ్లారి రూరల్, జూలై 23(ఆంధ్రజ్యోతి): తాలూకాలోని మోకా, యర్రగుడి, బెణకల్లు, బైరదేవనహళ్ళి, గోటూరు, వణేనూర్ తదితర ప్రాంతాల్లో రైతులు వరి నాట్లు వేసే పనిలో నిమగ్నమయ్యారు. తుంగభద్ర వరద ఉధృతం కావడంతో ఈసంవత్సరం ముందస్తు వర్షాలు కురవడంతో జలాశయం నిండు కుండలా మారింది. దీంతో హెచ్చెల్సీ, ఎల్లెల్సీలకు 10వ తేదీన నీరు విడుదల చేశారు. దీంతో రైతులు ఉత్సాహంతో వరినాట్లు వేస్తున్నారు.

సైబర్ నేరాల నియంత్రణపై అవగాహన

చెళ్లకెర, జూలై23(ఆంధ్రజ్యోతి): సైబర్ నేరాలపై విద్యార్థులు అప్రమత్తంగా ఉండాలని చెళ్లకెర సైబర్ క్రైం సీఐ వెంకటేశ్ అవగాహన కల్పించారు. బుధవారం స్థానిక గురురాఘవేంద్ర కల్యాణమండపంలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. వివిధ కళాశాలల విద్యార్థులు, యువకులు పాల్గొన్నారు. సైబర్ నేరగాళ్ల నుంచి మోసపోకుండా ఉండడం, మోసపోయిన వెంటనే పోలీస్‌స్టేషన్‌కు వచ్చి ఎలా ఫిర్యాదు చేయాలో పోలీసులు వివరించారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరి మృతి



సురేశ్ (ఫైల్)

బళ్లారి రూరల్, జూలై 23(ఆంధ్రజ్యోతి): నగరంలోని బసవేశ్వరనగర్‌కు చెందిన కొర్రిసురేశ్(45) అనే వ్యక్తి రోడ్డు ప్రమాదంలో మృతిచెందారు. పోలీసులు తెలిపిన మేరకు కారులో బెంగళూరుకు పనులపై వెళ్లి తిరిగివస్తుండగా హిరియూర్ ప్రాంతంలో బుధవారం ఉదయం ముందు వెళుతున్న లారీని ఓవర్‌టేక్ చేయబోయి వెనుక లారీని బలంగా కారు ఢీకొనడంతో సురేశ్ ఘటనా స్థలంలో మృతిచెందారు. డ్రైవర్ స్వల్పగాయాలతో బయటపడ్డాడు. స్థానికులు గమనించి కారు రిజిస్ట్రేషన్ నంబరు పరిశీలించి సంబంధిత వ్యక్తులకు సమాచారం అందించారు. మృతిచెందిన సురేశ్‌ను హిరియూర్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి పోస్ట్‌మార్టం నిర్వహించి బంధువులకు అప్పగించారు. హిరియూర్ పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు ప్రారంభించారు.

జూదరుల అరెస్టు

బళ్లారి రూరల్,జూలై 23(ఆంధ్రజ్యోతి): తాలూకాలోని మోకా పోలీస్ స్టేషన్ పరిధి బెణకల్లు గ్రామ శివార్లలో జూదం ఆడుతున్నట్లు సమాచారం రావడంతో ఎస్ఐ కాళింగ తోపాటు సిబ్బంది దాడి చేసిన ఐదుగురిని అరెస్టు చేశారు. మరో ఆరుగురు అక్కడి నుంచి ఉడాయించారు. వారిపైన కూడా కేసు నమోదు చేశామని ఎస్ఐ తెలిపారు. ఆయన మాట్లాడుతూ జూదం కుటుంబాలను నాశనం చేస్తుందన్నారు. జూదం ఆడితే సహించేది లేదని, వారిపై కఠినచర్యలు తప్పవని హెచ్చరించారు.

లోకాయుక్త దాడులు

బళ్లారి రూరల్, జూలై 23(ఆంధ్రజ్యోతి): నగరంలో బుధవారం బెంగళూరు లోకాయుక్త బృందం దాడులు నిర్వహించింది. బెంగళూరు పట్టణ, గ్రామీణ ప్రణాళిక అధికారి మారుతీ ఇంటిపై, పలుచోట్ల దాడులు చేసి ఇళ్లు, ఆస్తులను పరిశీలించారు. మారుతీ బళ్లారి, బెంగళూరుకు చెందినప్పటికి ఆయనకు బళ్లారిలో మూడు చోట్ల ఆస్తులు ఉన్నాయని సమాచారం. బెంగళూరు లోకాయు క్త బృందం బళ్లారిలో రేణుకానగర్, విద్యానగర్, కప్పగల్‌రోడ్డు, కల్లుకంబ తదితర ప్రాంతాలలో తనిఖీలు చేసి ముఖ్యమైన పత్రాలు, ఆస్తుల ప్రతాలను పరిశీలిస్తున్నారు.

వసతి గృహాల్లో సౌకర్యాలు మెరుగుపరచాలి

రాయచూరు, జూలై 23(ఆంధ్రజ్యోతి): జిల్లాలోని వివిధ ప్రభుత్వ విద్యార్థి వసతి గృహాల్లో సౌకర్యాలను మెరుగుపరచాలని ఏబీవీపీ నాయకులు డిమాండ్ చేశారు. వసతి గృహాల్లో నెలకొన్న సమస్యల పరిష్కారం కోరుతూ బుధవారం నగరంలోని అంబేడ్కర్ సర్కిల్ వద్ద ఆందోళన చేపట్టారు. నాయకులు మాట్లాడుతూ వసతిగృహాల్లో ప్రవేశం కోసం ఇప్పటికే విద్యార్థులు చేస్తున్న దరఖాస్తులను సత్వరం పరిశీలించి వెంటనే నియామకాలు పూర్తి చేయాలన్నారు.

రాబకోవి పీఠం దక్కేదెవరికో..?

● ఈసారి అధ్యక్ష స్థానం కొప్పళ్ జిల్లాకేనా?

బళ్లారి గాంధీనగర్, జూలై 23(ఆంధ్రజ్యోతి): బళ్లారి నగరంలోని రాయచూరు, కొప్పళ, బళ్ళారి, విజయనగర జిల్లాల పాల ఉత్పత్తి దారుల(రాబకోవి) ఫెడరేషన్‌కు 10వ తేదీన జరిగిన ఎన్నికల తరువాత ఇరు వర్గాలకు చెరోసగం ఓట్లు రావడంతో అధ్యక్ష స్థానం ఎవరిని వరిస్తుందనే విషయంపై ఉత్కంఠ నెలకొంది. ప్రస్తుతం 12 డైరెక్టర్ల స్థానాలు ఉండగా, అదనంగా వివిధ విభాగల నుండి ఐదుగురిని నామినేటెడ్ డైరెక్టర్లుగా నియమకాలు జరిగితే... అధ్యక్ష ఎన్నికలో నామినేటెడ్ డైరెక్టర్లే కీలక పాత్ర పోషిస్తారు. రాబకోవి అధ్యస్థానానికి కొప్పళ ఎమ్మెల్యే రాఘవేంద్ర హిట్నాళ్, మాజీ ఎమ్మెల్యే భీమానాయక్, కాంగ్రెస్ పార్టీ కొప్పళ జిల్లా అధ్యక్షుడు అమరేగౌడ బయ్యాపుర పేర్లు గట్టిగా వినిపిస్తున్నాయి. అధ్యక్ష స్థానానికి ఈ ముగ్గురు ప్రతినిధులు తమదైన రీతిలో ప్రయత్నాలు జరుపుతున్నారు. అధ్యక్ష ఎన్నిక విషయం ముఖ్యమంత్రి కోర్టుకు చేరుకుంది. ఈ ముగ్గురిలో ఎవరు అధ్యక్షులుగా ఎన్నిక చేయాలనే విషయం ముఖ్యమంత్రి సిద్దరామయ్య స్వయంగా నిర్ణయిస్తారని విశ్వసనీయ వర్గాల ద్వారా సమాచారం. ఇది ఇలా ఉండగా రాబకోవి సభ్యుడిగా నామినేట్ అయిన హంపయ్య స్థానంలో హిట్నాళ్‌ను నామినేటెడ్ డైరెక్టర్‌గా ఎంపిక చేసే అవకాశం ఉంది. దీనిని బట్టి చూస్తే హిట్నాల్ యూనియన్ అధ్యక్షుడు అయ్యే అవకాశం ఎక్కువ ఉందని విశ్లేషకులు భావిస్తున్నారు. అయితే భీమానాయక్ కూడా బళ్లారి జిల్లాకు చెందిన ఇద్దరు నాయకుల మద్దతుతో తీవ్ర ప్రయత్నాలు కొనసాగిస్తున్నట్లు తెలుస్తోంది. ఎన్నికల ముందు కొప్పళ, రాయచూరు జిల్లాలకు చెందిన డైరెక్టర్ల మధ్య ఐక్యత కొనసాగుతోంది. రెండు జిల్లాల నుంచి 8 మంది విజేత డైరెక్టర్లలో ఆరుగురు ఒకేమాటపై ఉండడంతో ప్రస్తుతం హిట్నాల్‌కు నామినేటెడ్ డైరెక్టర్ అయితే వారి సంఖ్య 7కి పెరిగే అవకాశం ఉంది. దీంతో భీమానాయక్‌కు అవకాశం తగ్గిపోతుంది. కొప్పళ, రాయచూరు జిల్లాల నుంచి ఎవరైనా అధ్యక్షుడిగా ఉండాలని రెండు జిల్లాల వైఖరి. ముఖ్యమంత్రి నేతృత్వంలో జరిగిన సమావేశంలో ఇదే ప్రతిపాదించినట్లు తెలుస్తోంది. ఈలోగా అమరేగౌడ బయ్యాపూర్ పేరు కూడా తెరపైకి వచ్చినా... అది పెద్దగా చర్చలో లేదు. రాబకోవి అధ్యక్ష, ఉపాధ్యక్ష పదవులు మరో రెండు మూడు రోజుల్లో జరిగే అవకాశం ఉంది.



రాబకోవి కార్యాలయం

స్వాతంత్ర్య వేడుకులకు పకడ్బందీ ఏర్పాట్లు

● కలెక్టర్ ప్రశాంత్‌కుమార్ మిశ్రా

బళ్లారి సిటీ, జూలై 23(ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్రంలో ఆగస్టు 15న నిర్వహించే 79వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలకు పక్కాగా ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ ప్రశాంత్ కుమార్ మిశ్రా సూచించారు. బుధవారం నగరంలోని కలెక్టర్ కార్యాలయంలో నిర్వహించిన ప్రాథమిక సమావేశానికి ఆయన అధ్యక్షత వహించి మాట్లాడారు. ఈసారి జిల్లా కేంద్రంలో జరిగే స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల కార్యక్రమంలో రెవెన్యూ మంత్రి కృష్ణబైరేగౌడ జెండాను ఎగురవేసి సందేశాన్ని ఇస్తారన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఐదు హామీ పథకాల జిల్లా పురోగతి, వివిధ శాఖల అభివృద్ధి పనుల పురోగతిపై పూర్తి సమాచారాన్ని అందుబాటులో ఉంచాలని ఆయన అధికారులను ఆదేశించారు. ఆగస్టు 15న నగరంలోని రాజ్‌కుమార్ పార్క్‌లోని మహాత్మా గాంధీ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించడం, హెచ్‌ఆర్ గవియప్ప సర్కిల్ సమీపంలోని భారీ స్తంభం వద్ద జెండా ఎగురవేసి సందేశం ఇస్తారన్నారు. కార్యక్రమాన్ని సజావుగా నిర్వహించేందుకు వివిధ శాఖల అధికారులతో కూడిన కమిటీలు ఏర్పాటు చేశామన్నారు. ఎటువంటి లోపాలు లేకుండా విజయవంతం చేయాలని అధికారులను ఆదేశించారు. అల్పాహారం, తాగునీటి, టాయిలెట్ సౌకర్యాలు సిద్ధం చేయాలన్నారు. మంత్రి సందేశం తర్వాత వివిధ పాఠశాలల విద్యార్థులతో సాంస్కృతిక కార్యక్రమం ఉంటాయన్నారు. ఆ రోజు సాయంత్రం జోళదరాశి దొడ్డనగౌడ రంగమందిరలో సాంస్కృతిక కార్యక్రమాలు ఉంటాయని తెలిపారు. ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొనేలా చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు. జిల్లాస్థాయి అధికారులు, సిబ్బంది జాతీయ ఉత్సవాల్లో తప్పనిసరిగా పాల్గొనాలని ఆదేశించారు. కార్యక్రమంలో అసిస్టెంట్ కలెక్టర్ మహమ్మద్ జుబేర్, అదనపు పోలీస్ సూపరింటెండెంట్ నవీన్‌కుమార్, అసిస్టెంట్ కమిషనర్ ప్రమోద్, కన్నడ సాంస్కృతిక శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ నాగరాజ్, వివిధ జిల్లాస్థాయి అధికారులు పాల్గొన్నారు.

ఇందిరా క్యాంటీన్ ప్రారంభం

బళ్లారి సిటీ, జూలై 23(ఆంధ్రజ్యోతి): నగరంలోని కౌల్‌బజార్ ప్రాంతంలో టీబీసాంటోరియం సర్కిల్ జన ఔషధి కేంద్రం సమీపంలో బుధవారం ఇందిరా క్యాంటీన్‌ను రూరల్ ఎమ్మెల్యే నాగేంద్ర ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ పేద, బలహీనవర్గాలకు, విద్యార్థులకు క్యాంటీన్‌లో రుచికరమైన ఆహారం లభిస్తుందన్నారు. ట్రామ్‌కేర్ ఆసుపత్రికి వచ్చివెళ్ళే వారితో పాటు అందరికీ ప్రయోజనకరంగా ఉంటుందన్నారు. మేయర్ నందీశ్, ఉపమేయర్ సుకుమ్, మాజీ మేయర్ రాజేశ్వరి, బగర్‌హుకుం అధ్యక్షుడు సిద్దమ్మనళ్ళి తిమ్మనగౌడ, కార్పొరేటర్ ఆసిఫ్‌బాషా, ఫయాజ్ అహమ్మద్, విమ్స్ డైరెక్టర్ గంగాధర్‌గౌడ, రేడియో పార్కు సోము, నాగలకెరి గోవింద, కాంగ్రెస్ కార్యకర్తలు పాల్గొన్నారు.



ఇందిరా క్యాంటీన్‌ను ప్రారంభిస్తున్న రూరల్ ఎమ్మెల్యే నాగేంద్ర

వీధి వ్యాపారుల ఆందోళన



మున్సిపల్ కార్యాలయం ఎదుట ఆందోళన చేస్తున్న వీధి వ్యాపారులు

చెళ్లకెర, జూలై 23(ఆంధ్రజ్యోతి): ఎన్నో ఏళ్లుగా చిరువ్యాపారులను స్థానిక మున్సిపల్ అధికారులు ఇబ్బందులకు గురిచేస్తుండటంతో బుధవారం స్థానిక తాలూకా కార్యాలయం ఎదుట వ్యాపారులు నిరసన వ్యక్తం చేశారు. అంతకముందు తహసీల్దార్, కమిషనర్‌లకు వేర్వేరుగా వినతిపత్రాలు సమర్పించారు. వారు మాట్లాడుతూ చిరువ్యాపారం చేస్తూ జీవనం సాగిస్తున్న మాపై ఉన్నట్లుండి మున్సిపల్ అధికారులు బంకులు తొలగించడం, గంపులు, ఇతర వ్యాపారాలు చేయకుండా నిషేధించడంపై అభ్యంతరం వ్యక్తం చేశారు. వేల కుటుంబాలు చిన్నవ్యాపారంపై జీవనం సాగిస్తున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. తమను ఇక్కడే కొనసాగించాలని వారు కోరారు.

ఈవీలకు పెరిగిన డిమాండ్

● ఐదేళ్లలో రెట్టింపైన అమ్మకాలు
● ఈవీ బస్సుల కొనుగోళ్లకు కేఎస్ఆర్టీసీ సిద్ధం

బళ్లారి, జూలై 23(ఆంధ్రజ్యోతి): ఆధునిక యుగంలో కొత్తరకం యంత్రాలు ఉత్పత్తి పెరిగింది. మానవులు కూడా అప్‌డేట్ వైపే మొగ్గుచూపుతున్నారు. డీజిల్, పెట్రోల్ వాహనాలు బదులు ఎలెక్ట్రిక్ వాహనాల (ఈవీ) కొనుగోళ్లు అధికమయ్యాయి. ప్రత్యేకించి నగరాల్లో ఎక్కువగా ఈవీ వాహనాలే కొనుగోళ్లు చేస్తున్నారు. ఇందుకు గడిచిన నాలుగైదు ఏళ్లుగా వాహనాల రిజిస్ట్రేషన్లు చూస్తే తెలుస్తుంది. పెట్రోల్, డీజిల్ రేట్లు పెరుగుతుండడం వల్లే ప్రజలు ఈవీలపైనే ఆసక్తి చూపుతున్నారు. నగరాల్లో ఎక్కువగా టూవీలర్స్, ఫోర్ వీలర్స్‌తో పాటు సిటీ బస్సులు కూడా వీటితోనే నడుస్తున్నాయి. ఇంధనం ధరలు పెరుగుతుండడంతో పాటు వాతావరణ కాలుష్యం నివారణకు కూడా ఈవీలు వినియోగిస్తున్నట్లు ప్రజలు చెబుతున్నారు. బళ్లారి, విజయనగర, కొప్పళ, చిత్రదుర్గం తదితర జిల్లాలోని నగరాల్లో ఎక్కువ శాతం ఈవీ ద్విచక్రవాహనాలతో పాటు కార్లు, సిటీ బస్సులు కూడా ఈవీలనే వినియోగిస్తున్నారు. జిందాల్, కిర్లోస్కర్, ఇతర పెద్దపెద్ద కంపెనీలు కూడా సిబ్బంది రాకపోకలకు వీటినే వినియోగిస్తున్నారు.



నగరంలో నడుస్తున్న ఈవీ బైక్‌లు

14వేల వాహనాల రిజిస్ట్రేషన్

బళ్లారి, కొప్పళ, విజయనగర, చిత్రదుర్గం జిల్లాలో 2022 నుంచి 2025 వరకు 14 వేల ఈవీ వాహనాలు రిజిస్ట్రేషన్లు జరిగాయి. ఇందులో కార్లు, ద్విచక్రవాహనాలు, బస్సులు కూడా ఉన్నాయి. ఎక్కువ మంది ఈవీ వాహనాల కొనుగోళ్లకు ఆసక్తి చూపుతున్నారు. ఇక బళ్లారి, విజయనగర జిల్లాల్లో కేఎస్ఆర్టీసీ బస్సులు కొత్తవి కొనుగోళ్లకు సిద్ధమైంది. 100 బస్సులు కొనుగోలు చేయనున్నారు. కేఎంఈఆర్సీ నిధుల నుంచి బళ్లారి, వియయనగర జిల్లాల్లో తిప్పేందుకు ఆర్డర్ ఇచ్చారు. అవి మరో రెండు మూడు నెలల్లో రోడ్లపైకి రానున్నాయి. నగరంలో వివిధ ప్రభుత్వ శాఖల్లో పనిచేసే ఉద్యోగులు, అనేక కంపెనీల్లో పనిచేసే వారు ఈవీ వాహనాల కొనుగోళ్లకే అసక్తి చూపుతున్నారు.



మాట్లాడుతున్న నాటక అకాడమీ అధ్యక్షుడు నాగరాజమూర్తి

శరణ సంస్కృతిని విస్తరించాలి

● కేవీ నాగరాజమూర్తి
● 'కర్పూరద బెళగు' పుస్తకావిష్కరణ

బళ్లారి సిటీ, జూలై 23(ఆంధ్రజ్యోతి): మన శరణ సంస్కృతిని విస్తరించాలని కర్ణాటక నాటక అకాడమీ అధ్యక్షుడు వి.నాగరాజ మూర్తి అన్నారు. బుధవారం నగరంలోని హీరదసూగమ్మ పాఠశాల ఆవరణలోని శరణ సక్కెర కరడీశ ఆడిటోరియంలో నిర్వహించిన రచయిత సిద్దరామ కల్మఠ్ రచించిన 'కూర్పూరద బెళగు' నాటకం పుస్తకాన్ని ఆవిష్కరించి, మాట్లాడారు. ఒక నగర స్థిరత్వాన్ని అందమైన, గొప్పభవనాల ద్వారా మాత్రమే కొలవలేమని ఆయన అన్నారు. ఒక దేశాన్ని నిర్ణయించడం అంటే ఆ దేశ సంస్కృతిని నిర్మించినపుడు మాత్రమే సాధ్యమవుతుందన్నారు. శివయోగి మరిస్వామి, సక్కెర కరడీశులు తమ జీవితాలను కేవలం భవనాలు, రాజభవనాలు నిర్మించడానికే పరిమితం చేయకుండా అందరి మనస్సుల్లో సంస్కృతి విత్తనాలను నాటారన్నారు. ఈదేశాన్ని సాం స్కృతికంగా బలోపేతం చేశారన్నారు. కార్యక్రమంలో శాసనమండలి సభ్యులు ఎం.సతీశ్, వీరశైవ విద్యావర్ధక సంఘం అధ్యక్షుడు మహంతేశ్, మేటి పంపనగౌడ, ఎల్లనగౌడ, జడేశ్, ప్రభుదేవా, అన్నాజీ కృష్ణారెడ్డి, లెక్చరర్ బసవరాజ్ పాల్గొన్నారు.

బాధితుడికి మాజీ మంత్రి పరామర్శ



బిమ్స్‌లో బాధితుడిని పరామర్శిస్తున్న మాజీ మంత్రి శ్రీరాములు

బళ్లారి గాంధీనగర్, జూలై 23 (ఆంధ్రజ్యోతి): బళ్లారి తాలూకా సంజీవరాయన కోట ప్రాంతంలో మంగళవారం తెల్లవారుజామున గొర్రెల కాపరి రాజప్పపై ఎలుగుబంటి దాడి చేసి తీవ్రంగా గాయపరిచింది. బాధితుడు ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు. విషయం విషయం తెలుసుకున్న మాజీ మంత్రి బి.శ్రీరాములు రాజప్పను పరామర్శించారు. బాధితుడికి ఉత్తమ వైద్యం అందించాలని వైద్యులకు సూచించారు. ఎలుగబంటి దాడిలో రాజప్ప ప్రాణాపాయం నుంచి బయట పడ్డాడని, అతడి ఆరోగ్య పరిస్థితి స్థిరంగా ఉన్నట్లు ఆసుపత్రి డైరెక్టర్ గంగాధర్ గౌడ తెలిపారు.


నీట మునిగిన వరి పంట



వరి పంటలోకి చేరిన వర్షపు నీరు

బళ్లారి సిటీ, జూలై 23(ఆంధ్రజ్యోతి): విజయనగరం జిల్లా హువినహడగలి గ్రామంలో లోతట్టు ప్రాంతాల్లోని వరి పంట నీటమునిగింది. మంగళవారం రాత్రి కురిసిన వర్షానికి కట్టెబెన్నూర్, హిరేబన్నిమట్టి, నందిగావి, మకరబ్బి గ్రామాల భూముల నుంచి ప్రవహించే నీరు నదికి చేరుకోవడానికి మార్గం లేకపోవడంతో పొలాల్లోకి చేరుతున్నాయి. ప్రతి వర్షకాలంలో బ్యాలహన్ని, నందిగావి గ్రామాల్లో 100 ఎకరాల వ్యవసాయభూమి మునిగిపోతుందని, దీనివల్ల పంట నష్టం జరుగుతోందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. 15-20 రోజులు నీటితో నిండటంతో పంట కుళ్లిపోతుందన్నారు. ప్రతి సంవత్సరం పంట నష్టపోతున్నామని రైతులు వాపోతున్నారు. పొలాల్లోకి పారుతున్న వర్షపు నీటిని మళ్లించేందుకు కాలువ తవ్వి తుంగభద్ర నదివైపు తరలించాలని రైతులు కోరుతున్నారు. ప్రజా ప్రతినిధులు ఎన్నికల్లో వాగ్దానాలు చేసి మరచిపోతున్నారని బారికర ప్రకాశ్, అంగడి గౌరీశ్, ప్రశాంత్, గుడ్డప్ప ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

బస్సు సౌకర్యం కల్పించండి



తహసీల్దార్‌కు వినతి పత్రం ఇస్తున్న విద్యార్థులు

సిరుగుప్ప, జూలై 23(ఆంధ్రజ్యోతి): బస్సు సౌకర్యం కల్పించాలని డిగ్రీకళాశాల విద్యార్థులు ఆందోళన చేపట్టారు. బుధవారం పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థులు ఆగళూరు, వసళ్ళి, వన్నళ్ళి తదితర ప్రాంతాల నుంచి ఆర్‌టీసీ బస్సులు వేళకు సరిగా రావని వాపోయారు. మధ్యాహ్నం 3గంటలకు గ్రామాలకు వెళ్లే ఆర్‌టీసీ బస్సులను సాయంత్రం 4గంటలకు మార్చాలని విద్యార్థులు కోరారు. అనంతరం తహసీల్దార్ గౌసియా బేగంకు వినతిప్రతం అందించారు. ఆమె స్పందిస్తూ తక్షణ చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ఆర్టీసీ డిపో అధికారులతో చర్చించారు.

స్పీడ్ బ్రేకర్లు ఏర్పాటు చేయండి: కలెక్టర్



మాట్లాడుతున్న కలెక్టర్ ఎంఎస్ దివాకర్

హోస్పేట, జూలై 23(ఆంధ్రజ్యోతి): జిల్లా వ్యాప్తంగా నగరాలు, పట్టణాల రోడ్లపై ప్రధాన కూడళ్ల వద్ద ప్రమాదాలను నివారించేందుకు స్పీడ్ బ్రేకర్లు ఏర్పాటు చేయాలని కలెక్టర్ ఎంఎస్ దివాకర్ సూచించారు. బుధవారం నగరంలోని కలెక్టర్ కార్యాలయం హాలులో జరిగిన రోడ్డు భద్రతా కమిటీ సమావేశానికి ఆయన అధ్యక్షత వహించి మాట్లాడారు. పట్టణాల్లో వాహనాలు వేగంగా వెళుతున్నాయని అనేక ఫిర్యాదులు వస్తున్న నేపథ్యంలో వేగాన్ని నియంత్రించడానికి స్పీడు బ్రేకర్లు ఏర్పాటు చేయాలన్నారు. పాఠశాల, కళాశాలల వద్ద కూడా వీటిని ఏర్పాటు చేయాలని సూచించారు. ఎన్‌హెచ్ఏఐ అధికారులు సమావేశంలో జాతీయ రహదారిపై మొత్తం ఐదు బ్లాక్ స్పాట్‌లను గుర్తించారు. మరో ఐదు బ్లాక్ స్పాట్‌లను వీలైనంత త్వరగా పూర్తి చేయాలని అధికారులను కలెక్టర్ ఆదేశించారు. హోస్పేట నగరంలో వర్షం కారణంగా కొన్ని చోట్లరోడ్లపై నీరు నిలిచిపోతున్నాయన్నారు. ఉన్న నీటిని కాలువల్లోకి సజావుగా ప్రవహించేలా చర్యలు చేపట్టాలన్నారు. జాతీయ రహదారి హోసహళ్లి రోడ్డు వద్ద 300 మీటర్ల పొడవున డ్రైనేజీ నిర్మించాలని, రోడ్డుపై ఉన్న చెత్తను తొలగించాలని కలెక్టర్ ఆదేశించారు.

హోసూరు జోన్

సిద్ధమవుతున్న వినాయక విగ్రహాలు



సిద్ధమైన విగ్రహాలు

హోసూరు, జూలై 23(ఆంధ్రజ్యోతి): వినాయక చవితి సమీపిస్తున్న తరుణంలో గణనాథుడి విగ్రహాలు సిద్ధమవుతున్నాయి. హోసూరు నగరంలో స్థానికులే కాకుండా ఉత్తరాదికి చెందిన కార్మికులు మకాం వేసి విగ్రహాలను సిద్ధం చేస్తున్నారు. ఉత్తరాది రాష్ట్రాలకు చెందినవారు సుమారు 2వేలమంది కార్మికులు 200కుపైగా ప్రాంతాలలో భారీ విగ్రహాలను తయారు చేస్తున్నారు. ఇక్కడ తయారయ్యే విగ్రహాలు పొరుగున ఉండే కర్ణాటకతోపాటు ఆంధ్రప్రదేశ్ ప్రాంతాలకు చెందినవారు కొనుగోలు చేస్తుంటారు. కాగా ప్లాస్టర్ ఆఫ్ పారిస్‌తో విగ్రహాలు ఏర్పాటు చేస్తున్నారని వాటికి అడ్డుకట్ట వేయాలని పర్యావరణవాదులు కోరుతున్నారు.

విద్యార్థులకు సర్టిఫికెట్ల పంపిణీ

హోసూరు, జూలై23(ఆంధ్రజ్యోతి): పుస్తకోత్సవంలో భాగంగా హోసూరులో లేబర్‌నెట్ లైవ్లీహుడ్ సెంటర్‌లో శిక్షణ పొందిన 500మంది విద్యార్థులకు సర్టిఫికెట్‌లు పంపిణీ చేశారు. హిందూస్తాన్ యూనిలీవర్ లిమిటెడ్, లేబర్‌నెట్, లైవ్లీఉడ్స్ ఫౌండేషన్ సంయుక్తంగా నిర్వహించిన శిక్షణా కార్యక్రమం విజయవంతమైంది. కార్పొరేషన్ మేయర్ సత్య ముఖ్యులుగా పాల్గొని విద్యార్థులకు సర్టిఫికెట్లను ప్రదానం చేసి అభినందించారు. విద్యార్థులు తమకు నచ్చిన అంశాలలో నైపుణ్యం సాధించడంతోపాటు సాంకేతికతను సద్వినియోగం చేసుకుని రాణించాలని సూచించారు. కౌన్సిలర్‌లు తదితరులు పాల్గొన్నారు.



సర్టిఫికెట్లు అందజేస్తున్న మేయర్ సత్య

పుస్తక మేళాకు ఆదరణ

హోసూరు, జూలై 23(ఆంధ్రజ్యోతి): హోసూరులో 12రోజులుగా జరుగుతున్న 14వ పుస్తకమేళాలో రూ.90లక్షల విలువైన పుస్తకాలు అమ్ముడయ్యాయి. తద్వారా పుస్తకమేళాకు ఆదరణ పెరిగినట్టయ్యింది. తమిళనాడు సైన్స్ ఫోరం ద్వారా కృష్ణగిరి జిల్లా యంత్రాంగం ఆధ్వర్యంలో ఏర్పాటైన మేళాలో 100 స్టాల్స్ ఉన్నాయి. సుమారు 2లక్షల పుస్తకాలు 10శాతం రాయితీతో రూ.90లక్షల విలువైన పుస్తకాలు అమ్ముడైనట్టు తెలుస్తోంది. ఈసారి ప్రభుత్వ ప్రభుత్వ పాఠశాల విద్యార్థులను ప్రోత్సహించేలా 12వేలమందికి ఒక్కొక్కరికి రూ.50 విలువైన ఉచిత కూపన్ ఇచ్చారు. 12రోజులపాటు సాగిన మేళా బుధవారంతో ముగిసింది.

కళాశాల విద్యార్థుల ఆందోళన



హాస్టల్ ఎదుట ఆందోళన చేస్తున్న విద్యార్థులు

రాయచూరు, జూలై 23(ఆంధ్రజ్యోతి): నగరంలోని అంబేడ్కర్ జూనియర్ కళాశాల బాలుర హాస్టల్ విద్యార్థులు బుధవారం సమ్మెకు దిగారు. హాస్టల్ వద్ద ఆందోళనకు దిగిన విద్యార్థులు సౌకర్యాలు మెరుగు పరచాలని డిమాండ్ చేశారు. కొన్నేళ్లుగా హాస్టల్ లో నెలకొన్న సమస్యల పరిష్కారం కోసం అనేక సార్లు విన్నవించినా అధికారులు స్పందించడం లేదని బాధ్యులైన హాస్టల్ వార్డన్‌ను సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు. విద్యార్థులకు స్వచ్ఛమైన తాగునీరు అందడం లేదని, శౌచాలయాలు, స్నానపు గదులు అస్తవ్యస్తంగా ఉండడంతో నిత్యం నరకం అనుభవిస్తున్నట్లు విద్యార్థులు వాపోయారు. కనీసం మరుగుదొడ్లు అందుబాటులో లేకపోవడం వల్ల హాస్టల్ విడిచి విద్యార్థులు దూర ప్రాంతాలకు బహిర్భూమికి వెళ్లే దుస్థితి తలెత్తిందన్నారు. సమస్యలన్నిటిని పరిష్కరించాలని లేని పక్షంలో ఆందోళనను మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు.